WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం
# స్వర్ణసాగరం
PRGI: APTEL/26/A2367
జాతీయ తెలుగు దినపత్రిక
www.swarnasagaram.com
ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 1 | సంచిక : 161 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | శుక్రవారం 21 ఆగస్టు 2026 | వెల : 2-00



## అత్యాచార, పోక్సో కేసులపై..
# సీఎం స్థాయిలో పర్యవేక్షణ

- ఈ అంశాల్ని అత్యంత సున్నితంగా చూడాలి
- రాష్ట్రాలు సహకరిస్తేనే మాదకద్రవ్యాల సమస్యకు పరిష్కారం
- నీటి వాటాలు, దక్షిణాది ప్రాతినిధ్యం, అంతర్రాష్ట్ర సమస్యలపై సీఎంల ప్రస్తావన
- తెలంగాణ, ఏపీ మధ్య విభజన సమస్యలు ఉన్నాయి
- ఆస్తులు, అప్పుల విభజనపై పరిష్కారాల కోసం హోంశాఖను సంప్రదించేందుకు ఇరు రాష్ట్రాలు అంగీకారం
- రాష్ట్రాల మధ్య జలవివాదాల్ని త్వరగా పరిష్కరించాలి
- దక్షిణ ప్రాంతీయ మండలి సదస్సులో కేంద్ర హోంమంత్రి

చెన్నై/అమరావతి,స్వర్ణసాగరం

అత్యాచారం, పోక్సో కేసుల్ని ముఖ్యమంత్రి స్థాయిలో సమీక్షించాలని కేంద్ర హోంమంత్రి, దక్షిణ ప్రాంతీయ మండలి కమిటీ ఛైర్మన్ అమిత్‌షా పేర్కొన్నారు. చెన్నై సమీపంలో 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సదస్సు గురువారం జరిగింది. దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, పలు కేంద్రశాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్‌షా కీలక ప్రసంగం చేశారు. బడి మానేసే పిల్లల సమస్యల్ని పూర్తిగా పరిష్కరించాలని అమిత్‌షా సూచించారు. పోషకాహార లోపాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మాదకద్రవ్య రహిత భారత్‌ను మూడేళ్లలో సాధించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వాలు కీలకపాత్ర పోషించకపోతే లక్ష్యం నెరవేరదని చెప్పారు. తెలంగాణ, ఏపీ మధ్య విభజన సమస్యలు ఉన్నాయని అమిత్‌షా గుర్తుచేశారు. ఆస్తులు, అప్పుల విభజనపై పరిష్కారాల కోసం హోంశాఖను సంప్రదించేందుకు ఇరు రాష్ట్రాలు అంగీకరించాయని చెప్పారు. రాష్ట్రాల మధ్య జలవివాదాల్ని త్వరగా పరిష్కరించాల్సి ఉందని గుర్తుచేశారు.

**విభజన సమస్యల పరిష్కారానికి సహకరిస్తాం**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజన జరిగి 12 ఏళ్లయినా చాలా అంశాలు పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. విభజన చట్టం సమస్యల పరిష్కారానికి తెలంగాణ సహకారం అందిస్తుందన్నారు. షెడ్యూలు-10లోని సంస్థల ఆస్తులను విభజించాలని ఏపీ అడుగుతోందని, చట్టంలో అందుకు సరైన ఆధారం లేదని కమిటీ దృష్టికి తెచ్చారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య సమస్యల్ని పరిష్కరించుకోవాలని, నిర్ణయాలు తీసుకోవడంలో సమాఖ్యవాద స్ఫూర్తిని అవలంబించాలని సూచించారు. నీటి భద్రత, ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, సరకు - మిగతా3లో

## కేంద్ర మంత్రికో నీతి.. మీ తండ్రీ కుమారులకో నీతా?



- విద్యాశాఖ మంత్రి లోకేశ్ తక్షణం రాజీనామా చేయాల్సిందే : వైఎస్ జగన్
- తప్పు ఒప్పుకుంటారు గానీ సీబీఐ ఎంక్వైరీ ఎందుకు వేయరు?
- పరీక్షా పత్రం రూపొందించేది, పరీక్ష నిర్వహించేది ఒక్కరేనా?
- ఈ రెండు బాధ్యతలు ఒకే వ్యక్తి నిర్వహించిన చరిత్ర ఎన్నడూ లేదు
- స్పోర్ట్స్ కోటాలో పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఉన్నవారికి ఉద్యోగాలెలా ఇచ్చారు?
- పరీక్ష పెట్టనవసరం లేదంటూ.. పైగా పీవీ సింధుతో ఎలా పోలుస్తారు?

అమరావతి, స్వర్ణసాగరం

మెగా డీఎస్సీ 2025 నియామకాల్లో తప్పులపై ప్రశ్నిస్తే అబ్బాకొడుకులు గింజుకుంటారే గానీ సీబీఐ విచారణకు అంగీకరించడం లేదంటూ సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ల వ్యవహార శైలిని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండగట్టారు. 'నీట్ ప్రశ్నపత్రం లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మరి అదే ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబుకు, ఆయన కుమారుడికి వేరే నీతి ఉంటుందా?' అని సూటిగా ప్రశ్నించారు. - మిగతా3లో



## సీబీఎస్ఈ 3 భాషల విధానం అమలుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- ప్రణాళికను పునఃపరిశీలించాలని బోర్డుకు ఆదేశం
- మూడు భాషల విధానం అమలుపై సుప్రీంకోర్టు అభ్యంతరం
- ఈ విధానం అమలుపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆదేశం
- మూడు భాష విద్యార్థులపై అదనపు భారాన్ని మోపడమే అవుతుందన్న ధర్మాసనం

3

## స్థానిక ఎన్నికల్లో భిన్నమైన వ్యూహంతో..

- అనుసరించాల్సిన విధివిధానాల రూపకల్పనకు కమిటీ
- మెరుగైన స్థాయిలో జనసేన పోటీ
- తగిన స్థానాలను ఎమ్మెల్యేలు గుర్తించాలి
- పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో అధినేత పవన్‌కల్యాణ్

3



## కలిసి నడుద్దాం.. కలిసి ఎదుగుదాం!

- ఏపీ, తమిళనాడు, కర్ణాటక మీదుగా బుల్లెట్ రైల్ కారిడార్
- దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్ నెట్‌వర్క్, డ్రైపోర్టులు
- ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనలు
- విభజన చట్టంలోని అంశాలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని కేంద్ర హోంమంత్రి దృష్టికి



అమరావతి,స్వర్ణసాగరం

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ రైల్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదించారు. అమరావతి, బెంగళూరు, చెన్నై నగరాలను అనుసంధానించే ఈ మార్గం మూడు రాష్ట్రాల మధ్య ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతమిస్తుందని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రైపోర్టులు ఏర్పాటుచేయాలని, దక్షిణ గ్రిడ్‌ను జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానించాలని, యూనివర్సిటీలు, ఇతర నైపుణ్య సంస్థలతో కలిసి సంయుక్త నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను నెలకొల్పాలని సూచించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన గురువారం చెన్నై సమీపంలో జరిగిన 31వ దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో చంద్రబాబు పలు కీలక ప్రతిపాదనలు చేశారు. రాష్ట్ర విభజన - మిగతా3లో

# శిశు గృహ సంరక్షణలోని బాలుడిని చట్టబద్ధంగా దత్తత




విజయవాడ,స్వర్ణసాగరం

జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక దత్తత సంస్థ శిశు గృహంలో సంరక్షణ పొందుతున్న బాలుడిని గురువారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఆధ్వర్యంలో చట్టబద్ధంగా దత్తత ఇచ్చే ప్రక్రియను పూర్తి చేశారు. దత్తత ప్రక్రియలో భాగంగా బాలుడి గుర్తింపునకు సంబంధించిన వివరాలు, దత్తత తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలు, పత్రికా ప్రకటన, అవసరమైన రికార్డులను అధికారులు పరిశీలించారు. దత్తత ప్రక్రియలో చట్టపరమైన నిబంధనలు, నిర్దేశిత విధానాలను తప్పనిసరిగా పాటించేలా తీసుకున్న చర్యలపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాలుడి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, ఇప్పటివరకు నిర్వహించిన వైద్య పరీక్షలు, ఆరోగ్య రికార్డులపై కూడా ఆరా తీశారు. బాలుడి ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను దత్తత తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం దత్తత తీసుకుంటున్న తల్లిదండ్రులతో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడి బాలుడిని ప్రేమతో, బాధ్యతతో పెంచాలని సూచించారు. బాలుడి ఆరోగ్యం, పోషణ, విద్య, భద్రత, సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సురక్షితమైన, ప్రేమపూర్వకమైన కుటుంబ వాతావరణాన్ని కల్పించి బాలుడి భవిష్యత్తుకు అవసరమైన అవకాశాలను అందించాలని సూచించారు. దత్తత అనంతరం బాలుడికి కన్నబిడ్డతో సమానంగా అన్ని హక్కులు, బాధ్యతలు, కుటుంబ సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. సంబంధిత చట్టపరమైన నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా దత్తత ప్రక్రియను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. బాలల సంరక్షణ, రక్షణ, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, శిశు గృహంలో సంరక్షణ పొందుతున్న బాలల భద్రత, ఆరోగ్యం, పోషణ, విద్య, భవిష్యత్ సంక్షేమానికి అవసరమైన చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ ద్వారా పిల్లలకు సురక్షితమైన కుటుంబ వాతావరణం, మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తానా బేగం, దత్తత అధికారి జాన్సన్, న్యాయ అధికారి కిరణ్, శిశు గృహ మేనేజర్ దీపిక, సామాజిక కార్యకర్త అరుణ తదితరులు పాల్గొన్నారు.

## సర్‌పై ప్రత్యేక ప్రచారం

### - జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

విజయవాడ, స్వర్ణసాగరం



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జూలై 31న ముసాయిదా జాబితా ప్రచురణ జరిగిందని, ఈ నెల 30వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ కొనసాగనున్న నేపథ్యంలో ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా క్షేత్రస్థాయిలో అధికారులు, బూత్ స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి ఓటర్లకు అవసరమైన సేవలు అందించాలని సూచించారు. గురువారం సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేక సమగ్ర సవరణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశతో పాటు జిల్లా అధికారులు హాజరయ్యారు. అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను ప్రచురించాల్సి ఉన్నందున నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అన్ని పనులను పూర్తి చేయాలని వివేక్ యాదవ్ సూచించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నోటీసుల జారీ, ధ్రువపత్రాల పరిశీలన, విచారణ, తుది ఉత్తర్వుల జారీ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8ల పరిష్కారానికి కూడా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రత్యేక ప్రచార దినాల్లో బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండి ఓటర్లకు సేవలు అందించాలని ఆదేశించారు. ముసాయిదా ఓటర్ల జాబితాతో పాటు ఏఎస్‌డీ జాబితా, నోటీసులు జారీ చేసిన వారి వివరాలను పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎం. లక్ష్మీనరసింహం, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు 57 సీజనల్ హాస్టళ్ల మంజూరు

విజయవాడ, స్వర్ణసాగరం

జిల్లాకు 57 సీజనల్ హాస్టళ్లు మంజూరయ్యాయని, వాటి నిర్వహణకు గిరిజన, బీసీ, సాంఘిక సంక్షేమ శాఖలతో పాటు స్వయం సహాయక సంఘాలు, గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త ఆర్. రమేష్‌బాబు తెలిపారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు సమర్పించాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎ.కొండూరు, చందర్లపాడు, గంపలగూడెం, జగ్గయ్యపేట, కంచికచర్ల, నందిగామ, పెనుగంచిప్రోలు, వత్సవాయి, వీరుళ్లపాడు, విజయవాడ రూరల్ మండలాల్లో వలస వెళ్లిన తల్లిదండ్రుల పిల్లలకు విద్య, భోజన వసతి కల్పించేందుకు ఈ సీజనల్ హాస్టళ్లు మంజూరయ్యాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే స్వచ్ఛంద సంస్థలు సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం గుర్తింపు పొంది, కనీసం మూడేళ్ల అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ అనుమతితో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు, సంస్థలు రాతపూర్వక దరఖాస్తులను ఈ-మెయిల్ లేదా లేఖ ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తులు, ప్రతిపాదనలను ఈ నెల 24వ తేదీలోగా విజయవాడలోని సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు ఏఎల్ఎస్ సమన్వయకర్తను 8712655816 నంబర్‌లో సంప్రదించవచ్చని ఏపీసీ రమేష్‌బాబు తెలిపారు.

# అత్యాచార, పోక్సో కేసులపై.. సీఎం స్థాయిలో పర్యవేక్షణ

-మొదటిపేజీ తరువాయి

రవాణా, ఆర్థికపరమైన పోటీలాంటివి రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలకు సవాళ్లుగా మారనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. వాటిని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాలన్నారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్రం ఆర్థిక సాయం అందించాలని కోరారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా తమకు కావాలన్నారు. ఈ వివాదం కృష్ణా ట్రైబ్యునల్‌లో పరిధిలో ఉందని, దీన్ని త్వరగా పరిష్కరించాలని కోరారు. రాబోయే ప్రాంతీయమండలి సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ప్రతిపాదించారు.

**సరిహద్దుల్లో సమస్యలున్నాయి**

**- తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ మంత్రి**

భద్రాచలం సమీపంలోని 5 గ్రామపంచాయతీలు ఏపీ పరిధిలోనే ఉన్నాయని, వాటిని తెలంగాణలో కలిపేలా కేంద్రం చొరవ చూపాలని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ ప్రజలకు అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం 282 కి.మీ. దూరంలో ఉందని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం 40 కి.మీ. దూరంలోనే ఉందని గుర్తుచేశారు. నిత్యావసర వస్తువులు, వ్యవసాయ, అటవీ ఉత్పత్తుల రవాణాకు చెక్‌పోస్టులతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భద్రాచలం-ఏలూరు రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.



ఆయిల్‌పామ్ గెలల ధర రూ.25 వేలుగా నిర్ణయించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఏపీ ముఖ్యమంత్రి సహకరించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ రైల్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రైపోర్టులు ఏర్పాటుచేయాలని, దక్షిణ గ్రిడ్‌ను జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానించాలని, యూనివర్సిటీలు, ఇతర నైపుణ్య సంస్థలతో కలిసి సంయుక్త నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను నెలకొల్పాలని సూచించారు.

జనాభా స్థిరీకరణలో తమిళనాడు విజయం సాధించిందని, పార్లమెంటు స్థానాలు కోల్పోయేందుకు రాష్ట్రం ఒప్పుకోదని తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ తేల్చిచెప్పారు.

దక్షిణాది వాణిని గౌరవిస్తూ 1971నాటి పునర్విభజన ఆధారంగానే మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావాలని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రతిపాదించారు. పార్లమెంటులో సంఖ్యాబలం పెంచకుండానే మహిళలకు మూడో వంతు రిజర్వేషన్‌ను అమలుచేయాలని కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ డిమాండ్ చేశారు.

**వందేమాతరాన్ని అవమానించినట్లే: అమిత్‌షా**

వందేమాతరంలో రెండు చరణాలే పాడతామని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయం చట్టాన్ని ధిక్కరించడమేనని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలిపారు. చెన్నైలో ఆయన ఓ ఛానెల్‌తో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసినవారిని ఇది అవమానించడమేనని వ్యాఖ్యానించారు. 1937లో అప్పట్లో ముస్లింలను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీయే వందేమాతరం గీతాన్ని రెండు భాగాలుగా విభజించిందని తెలిపారు. ఈ తప్పిదాన్ని మోదీ ప్రభుత్వం సరిదిద్ది మొత్తం గీతానికి చట్టపరమైన గుర్తింపు తెచ్చిందన్నారు.

# పార్కులు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**పర్యాటక ప్రాంతాలను ఆదాయ వనరులుగా తీర్చిదిద్దాలి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ, స్వర్ణసాగరం

నగరంలోని పార్కులు, పర్యాటక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు వాటిని ఆదాయ వనరులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అధ్యక్షతన టూరిజం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలు, నగరంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు వినోదాన్ని అందించే కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. నగరంలోని పార్కులను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన అనుభూతిని కల్పించాలని కలెక్టర్ సూచించారు. పార్కులలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు, వాటిని సమర్థవంతంగా వినియోగించుకుని ఆదాయ వనరులుగా మార్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బెరం పార్క్, భవానీ ఐలాండ్, ఫెర్రీ ఘాట్ తదితర పర్యాటక ప్రాంతాల్లో ప్రతి శని, ఆదివారాల్లో ప్రజలను ఆకర్షించే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదాత్మక కార్యక్రమాలు తదితరాలను నిర్వహించడం ద్వారా నగర ప్రజలతో పాటు పర్యాటకులను కూడా ఈ ప్రాంతాల వైపు ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలోని మ్యూజియం,



మొగల్రాజపురంలోని గృహలు తదితర చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను పర్యాటకులు సందర్శించేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఆయా ప్రాంతాల ప్రాధాన్యతను తెలియజేసే సమాచారాన్ని అందుబాటులో ఉంచడంతో పాటు పర్యాటకులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సింగ్‌నగర్‌లో సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సిబార్ డిస్నీల్యాండ్ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని నగర ప్రజలకు వినోదం, ఆహ్లాదాన్ని అందించే ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. విజయవాడ నగర ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి తమ ఖాళీ సమయాన్ని ఆనందంగా గడిపేలా పర్యాటక, వినోద ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. నగరంలోని పర్యాటక ప్రదేశాలను అనుసంధానిస్తూ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, పర్యాటకుల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక శాఖ, జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖలు మరియు టూరిజం కౌన్సిల్ సభ్యులు సమన్వయంతో పనిచేసి విజయవాడ నగరాన్ని మరింత ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రతిపాదిత అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి, జిల్లా టూరిజం అధికారి కొల్లేటి రమేష్, టూరిజం కౌన్సిల్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్‌కు పటిష్ట ఏర్పాట్లు

- **ప్రతి విషయంలోనూ అత్యంత జాగ్రత్తగా ఉండాలి**
- **అలసత్వానికి తావులేకుండా విధులు నిర్వర్తించండి**
- **అధికారులకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాలు**

విజయవాడ, స్వర్ణసాగరం

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయని.. ఈ నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ యూపీఎస్సీ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ఎన్.రాజేశ్వరరావుతో కలిసి కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో సివిల్స్ మెయిన్స్‌పై ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. కస్టోడియన్, లైజనింగ్ అధికారులతో పాటు వెన్యూ సూపర్వైజర్లు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యం, పోస్టల్, ప్రజా రవాణా, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొనగా పరీక్షల్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో 124 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నెల 21న పేపర్-1 ఎస్సే, 22న జీఎస్-1, జీఎస్-2, 23న జీఎస్-3, జీఎస్-4,




29న భారతీయ భాష, ఇంగ్లిష్, 30వ తేదీన ఆప్షనల్ సబ్జెక్టులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని.. బందోబస్తు, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య శిబిరం తదితరాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూపీఎస్సీ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించేలా చూడాలన్నారు. మొబైల్ అప్లికేషన్ ద్వారా అభ్యర్థుల ముఖ ఆధారిత గుర్తింపు ప్రక్రియ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా వివిధ ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రానికి బస్సులను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజారవాణా శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కలిసి నడుద్దాం.. కలిసి ఎదుగుదాం!

-మొదటిపేజీ తరువాయి

సమస్యలు, పెండింగ్ అంశాల్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రకృతి విపత్తుల సమయంలో రాష్ట్రాల పరస్పర సహాయానికి ప్రత్యేక విపత్తు నిర్వహణ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. 24 అంశాలతో కూడిన ఎజెండాపై ఈ సమావేశంలో చర్చించారు.

**10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా దక్షిణ భారతం**

“రాష్ట్రాల మధ్య సమస్యల్ని పరస్పర సహకారం, సమన్వయంతో పరిష్కరించుకోవాలి. దక్షిణాది రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు సాగితే భారతదేశ అభివృద్ధికి మరింత బలమైన చోదకశక్తిగా నిలుస్తాయి. 2047 నాటికి దక్షిణ భారతానికి 10 ట్రిలియన్ డాలర్లకుపైగా ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సామర్థ్యం ఉంది” అని చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాలు పరస్పర సహకారంతో, సమగ్రాభివృద్ధి సాధించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. “దేశ స్థూల ఉత్పత్తిలో దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత వాటా 31%. 2047 నాటికి భారత్ 30–35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్య సాధనలో దక్షిణాది రాష్ట్రాలు ప్రధాన భూమిక పోషిస్తాయి. దక్షిణాది రాష్ట్రాలన్నీ సమష్టిగా 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థికశక్తిగా ఎదుగుతాయి” అని సీఎం పేర్కొన్నారు. దక్షిణాదిలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఉత్తర భారతదేశంలోని ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థయాత్ర సర్క్యూట్ ఏర్పాటుచేయాలని సూచించారు. తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, మదురై, రామేశ్వరం, మైసూరు లాంటి ప్రాంతాలను వారణాసి, అయోధ్య, చార్‌ధామ్ క్షేత్రాలతో అనుసంధానిస్తే దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించే అవకాశం ఉంటుందని తెలిపారు.

**విభజన సమస్యలు ఇప్పటికీ తీరలేదు**

రాష్ట్ర విభజనకు సంబంధించిన పెండింగ్ అంశాల్ని చంద్రబాబు ప్రస్తావించారు. విభజన జరిగి 12 ఏళ్లయినా 9, 10 షెడ్యూళ్లలోని సంస్థల విభజన పూర్తికాలేదన్నారు. “ఆస్తులు, అప్పులు, సంస్థల విషయంలో సమన్యాయం జరగాలి. విభజన చట్టంలోని సెక్షన్ 66 కింద ఉన్న అంశాలపై కేంద్ర నిర్ణయం కోసం గత తొమ్మిదేళ్లుగా ఎదురుచూస్తున్నాం. సెక్షన్ 56లోని సమస్యలు, వనరుల లోటు, ఆర్థిక భారానికి సంబంధించిన అంశాల్నీ పరిష్కరించాలి” అని సీఎం కోరారు. రాష్ట్రానికి కేంద్రం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్రం హామీ ఇచ్చిన 11 జాతీయ సంస్థల్లో 10 ఇప్పటికే ఏర్పాటవడం సంతోషదాయకమన్నారు. పోలవరం, దక్షిణ కోస్తా రైల్వే జోన్, అమరావతి నిర్మాణంలో కేంద్ర సహకారం ఎంతో కీలకమని చెప్పారు. దిల్లీలోని ఏపీ భవన్ ఆస్తుల విభజన అంశాన్నీ సీఎం ప్రస్తావించారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. “నీటి వనరులు, పచ్చదనం, జీవన ప్రమాణాలు, కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాల్ని దృష్టిలో ఉంచుకుని నూతన రాజధాని నిర్మిస్తున్నాం” అని తెలిపారు. విభజన చట్టంలోని షెడ్యూల్–13 కింద ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులివ్వాలని సీఎం కోరారు. విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్, మూడు విమానాశ్రయాల అభివృద్ధి, కొత్త రాజధానికి రైలు అనుసంధానం లాంటి పనులు వేగంగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. దుగరాజపట్నం పోర్టు, బీపీసీఎల్ రిఫైనరీ, విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులు, కడపలోని జిందాల్ స్టీల్‌కు రైలు అనుసంధానంపై అనుమతులు మంజూరుచేయాలని కోరారు.

**నదుల అనుసంధానంతో మిగులు జలాలు**

భవిష్యత్తు నీటి భద్రతకు నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారమని చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా లాంటి 40 నదులు 28 జిల్లాలకు సాగునీరు అందిస్తున్నాయి. గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా పోలవరం, కృష్ణా, పెన్నా మీదుగా 500 టీఎంసీలకుపైగా మిగులు వరద జలాల్ని కావేరి బేసిన్‌కు తరలించే ప్రతిపాదనను సీఎం కేంద్రం ముందుంచారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. గంగా–కావేరి అనుసంధానాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించారు. “గంగానది మిగులు జలాల్ని దక్షిణాదికి తరలించడం ద్వారా తమిళనాడుతో పాటు దక్షిణాది రాష్ట్రాల నీటి భద్రతకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. నదీ పరీవాహక ప్రాంతాల మధ్య సమన్వయానికి ప్రత్యేక దక్షిణాది నదీ బేసిన్ల సమన్వయవ్యవస్థను ఏర్పాటుచేయాలి. డీపీఆర్‌లు, అనుమతుల్ని నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తిచేయాలి” అని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

**రూ.16 వేల కోట్ల ఆర్థికలోటు భర్తీ చేయండి**

రాష్ట్రానికి పరిష్కారం కాని బిల్లులు, రైతులకు రుణమాఫీకి సంబంధించిన బకాయిల్లాంటి నాలుగు హెడ్‌ల కింద రూ.32 వేల కోట్లు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.16 వేల కోట్లు ఇచ్చారని, మిగతా రూ.16 వేల కోట్లు కూడా మంజూరుచేయాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది.

**దార్శనికుడిలా మాట్లాడారని చంద్రబాబుకు ప్రశంసలు**

దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం, ఆయన చేసిన సూచనలు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల ప్రశంసలు అందుకున్నాయి. సీఎం కేవలం ఆంధ్రప్రదేశ్ సమస్యల ప్రస్తావనకే పరిమితం కాకుండా.. దేశ విస్తృత ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకుని, దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర, వాటి సమష్టి ఆర్థికశక్తి, నీటి, ఇంధన భద్రత, రవాణా అనుసంధానం, విపత్తుల నిర్వహణ, విద్య, నైపుణ్యాభివృద్ధి లాంటి అంశాలతో మొత్తం దక్షిణ భారత దేశానికి ఒక దీర్ఘకాలిక ఉమ్మడి అభివృద్ధి ఎజెండాను ప్రతిపాదించడం ఆకట్టుకుంది. కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య, రాష్ట్రాలకు, రాష్ట్రాలకు మధ్య ఘర్షణలు అభివృద్ధికి ఉపయోగపడవని, పరస్పర విశ్వాసం, సంప్రదింపులు, ఇచ్చిపుచ్చుకునే ధోరణి, సహకార సమాఖ్య విధానంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆయన వివరించారు. దక్షిణాది రాష్ట్రాలు పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతుల కోసం పరస్పరం పోటీ పడటంతోనే ఆగిపోకుండా, కొన్ని కీలక రంగాల్లో కలిసికట్టుగా పనిచేయాలని సూచించడం ఆకట్టుకుంది. సీనియర్ నాయకుడు, అనుభవజ్ఞుడైన చంద్రబాబు ఒక దార్శనికుడిలా మాట్లాడారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సహా పలువురు ప్రశంసించారు. ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ ముఖ్యమంత్రులు జోసెఫ్ విజయ్, డీకే శివకుమార్, వి.డి.సతీశన్, తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్లు కె.కైలాశ్‌నాథన్, అడ్మిరల్ డి.కె.జోషి, ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రికో నీతి.. మీ తండ్రీ కుమారులకో నీతా?

-మొదటిపేజీ తరువాయి

మెగా డీఎస్సీ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ మెగా డీఎస్సీ 2025 కుంభకోణం, ఏపీపీఎస్సీ 2018 గ్రూప్––1ల నియామకాలపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అసెంబ్లీలో మాట్లాడిన మాటల వీడియోలను చూపుతూ.. వారు చెబుతున్నవన్నీ అబద్ధాలేనంటూ సాక్ష్యాధారాలతో కడిగిపారేశారు. మెగా డీఎస్సీ విషయంలో లీకేజీ, అక్రమాలపై తాము ఇప్పటివరకూ ఏ అంశాలనైతే ప్రజలముందు ఉంచామో అవన్నీ వాస్తవమేనని క్రమంగా ప్రభుత్వమే అంగీకరించే పరిస్థితిలోకి వచ్చిందని వైఎస్ జగన్ తెలిపారు. ఇవన్నీ గట్టిగా ప్రస్తావిస్తామనే తమకు ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు ఇవ్వడం లేదని, చివరకు ప్రతిపక్షం లేకుండానే సభను నడుపుతున్నారని చెప్పారు. సభలో ఉన్న ఏకైక ప్రతిపక్షం తమదని, ప్రతిపక్ష నాయకుడిగా తనను గుర్తిస్తే, సభా నాయకుడు సీఎంతో సమానంగా సమయం ఇవ్వాల్సి వస్తుంది కాబట్టి గుర్తించడం లేదన్నారు. గ్రౌండ్‌లో ప్రత్యర్థి జట్టు లేనిచోట.. బౌలింగ్, ఫీల్డింగ్ లేకుండా తండ్రీ కుమారులు ఇద్దరూ బ్యాటింగ్ చేస్తూ, తాము అద్భుతంగా చేశామని తమకు తాము కితాబు ఇచ్చుకుంటున్నారంటూ వైఎస్ జగన్ ఎద్దేవా చేశారు. మెగా డీఎస్సీ పేపర్ లీకేజీ, అక్రమాలపై చర్చ చేపట్టాలంటూ నాలుగు రోజులపాటు శాసన మండలిని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు స్తంభింపచేశారని తెలిపారు. అసెంబ్లీలో మాట్లాడతారేగానీ పక్కనే ఉన్న మండలిలో మాత్రం చర్చకు ముందుకు రావడం లేదన్నారు. ఎందుకంటే అక్కడ తమ పార్టీ బలం ఉంది కాబట్టి చర్చ జరిగితే వారి తప్పులన్నీ బయటకు వస్తాయని, డీఎస్సీలో తప్పులు జరిగాయి కాబట్టి, సీబీఐ విచారణ చేయాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది కాబట్టి జరిగిన దానికి బాధ్యత వహిస్తూ లోకేశ్ రాజీనామా చేసి తప్పుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ తేటతెల్లం అవుతోంది కాబట్టి అక్కడ చర్చించడానికి ముందుకు రావడం లేదని వైఎస్ జగన్ పేర్కొన్నారు. మెగా డీఎస్సీ స్కామ్‌ను అంశాలవారీగా ఎండగడుతూ వైఎస్ జగన్ ఏమన్నారంటే..

**ఒక్కరికే రెండు బాధ్యతలా..?**

డీఎస్సీ పరీక్ష ప్రశ్నల తయారీ అనేది ఒక అంశం. పరీక్ష నిర్వహణ అనేది మరో అంశం. ఈ రెండూ ఒకే అధికారి చేతిలో పెట్టినట్లు అసెంబ్లీలో లోకేశ్ స్వయంగా అంగీకరించారు. పైగా తప్పేముంది? అని దబాయిస్తున్నారు. ప్రశ్న పత్రం తయారీ అనేది



ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బాధ్యత. పరీక్షల నిర్వహణ డీఎస్సీ కన్వీనర్ బాధ్యత. ఈ రెండూ ఒక్కరి చేతే చేయిస్తే పారదర్శకత లోపిస్తుంది. లీకేజీకి ఎక్కువ అవకాశం ఉంది. ఈ రెండు బాధ్యతలు ఒకే వ్యక్తి నిర్వహించిన చరిత్ర ఎన్నడూ లేదు. ప్రశ్నాపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణను ఒకే వ్యక్తికి అప్పగించామని లోకేశ్ తనకు తానుగా ఒప్పుకున్నారు. పరీక్ష పత్రం తయారీ, నిర్వహణ ఒకే వ్యక్తికి ఇవ్వడం వల్ల చెక్స్ అండ్ బ్యాలన్స్ అనేది తొలగిపోయింది. లీకేజీకి ద్వారాలు తెరిచారు. అందుకే సీబీఐ విచారణ అడుగుతున్నాం.

**ఫస్ట్ ర్యాంక్ వచ్చిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నవీన్‌కు ఎందుకు ఉద్యోగం ఇవ్వలేదు?**

డీఎస్సీ ప్రశ్న పత్రాలు తయారు చేసే విభాగంలో ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నవీన్‌కు తొలి ర్యాంక్ వచ్చిందని తండ్రీ కుమారులు అసెంబ్లీ సాక్షిగా అంగీకరించారు. మొదటి మెరిట్ లిస్టులో నవీన్ పేరు ఉంది. రెండో లిస్ట్‌లో అతడి పేరు తీసేశారు. ఫస్ట్ ర్యాంక్ వచ్చిన నవీన్‌కు ఎందుకు ఉద్యోగం ఇవ్వలేదు? నవీన్ పేరు లేకుండా సెకండ్ మెరిట్ లిస్ట్ ఎందుకు విడుదల చేశారు? సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రాలేదు కాబట్టి ఇవ్వలేదని చంద్రబాబు, లోకేశ్ చెబుతున్నారు. ఇదే వాస్తవం అయితే నవీన్ కోర్టుకు ఎందుకు వెళ్లాడు? తన ఐడీని బ్లాక్ చేశారని, కాల్ లెటర్ తనకు పంపలేదని నవీన్ కోర్టుకు వెళ్లాడు. తన ఐడీ బ్లాక్ అయ్యిందని, కాల్ లెటర్ రాలేదని, డీఎస్సీలో మంచి మార్కులు వచ్చాయని, అయినా ఎందుకు కాల్ లెటర్ రాలేదని, ఇది నా జీవితానికి చివరి ఛాన్స్ అని విద్యాశాఖకు నవీన్ మెయిల్ పెట్టాడు. ఇదే విధంగా కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాడు. క్యాండిడేట్ ఐడీని బ్లాక్ చేసి కాల్ లెటర్ పంపనప్పుడు అతడు వెరిఫికేషన్‌కు ఎలా రాగలుగుతాడు? దీనికి అసెంబ్లీలో అబ్బా కొడుకులిద్దరూ ఎందుకు సమాధానం చెప్పలేదు? ఎందుకు చెప్పలేదంటే కారణం.. నవీన్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కాబట్టి. ఆయనకు ప్రశ్నపత్రం యాక్సెస్ ఉంది కాబట్టి. పరీక్షల్లో ఫస్ట్ ర్యాంక్ వచ్చింది కాబట్టి. అతడికి ఉద్యోగం ఇస్తే గోల అవుతుంది కాబట్టి.

ముందస్తుగానే మెరిట్ లిస్ట్‌లో అతడి పేరు తొలగించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. అతడికి ఉద్యోగం ఇవ్వలేదు. తన ఐడీని బ్లాక్ చేశారు. కాల్ లెటర్ పంపలేదు. మొదటి లిస్ట్‌లో అతడి పేరు ఉంది, రెండో లిస్ట్‌లో తీసేశారు. ఆ వ్యక్తి కోర్టుకు వెళ్లాడు. తన ఉద్యోగం తనకు ఇవ్వాలని అడుగుతున్నాడు. మరి ఇది నవీన్ దగ్గరే ఆగిపోయిందా? ఇంకా జరిగిందా? సీబీఐ దర్యాప్తు జరిగితేనే కదా ఇవన్నీ తెలిసేది.

**పార్టిసిపేషన్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలా?**

ఒకవైపు సింధు పేరు చెప్పి వీళ్ల అబద్ధాలు ఏ విధంగా ఉన్నాయంటే, ఆర్చరీలో నేషనల్ ఛాంపియన్ షిప్ సాధించిన ఎస్టీ అభ్యర్థి దుర్గయ్యకు కాల్ లెటర్ పంపి ఉద్యోగం ఇవ్వలేదు. అతను ఆర్చరీలో బంగారు పతకం సాధించాడు. ఆశ్చర్యమేమిటో తెలుసా? వీళ్ల పార్టీకి చెందిన నేతలు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షుడిగా ఉన్న “సాఫ్ట్‌బాల్” అసోసియేషన్ నుంచి, అలాగే లోకేశ్ తోడల్లుడు, విశాఖపట్నం ఎంపీ భరత్ అధ్యక్షుడిగా ఉన్న “జూడో అసోసియేషన్ నుంచి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఆధారంగా స్పోర్ట్స్ కోటాలో ఏకంగా 372 పోస్టులు భర్తీ చేశారు.

## స్థానిక ఎన్నికల్లో భిన్నమైన వ్యూహంతో..

స్వర్ణసాగరం అమరావతి

‘వైకాపా దాష్టీక పాలనకు చరమగీతం పాడాలనే సంకల్పంతోనే గత శాసనసభ ఎన్నికల్లో జనసేన పార్టీ 21 స్థానాలకే పరిమితమై పోటీ చేసింది. ఆ వ్యూహం ఆ ఎన్నికలకే పరిమితం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాంతాల వారీగా అక్కడి రాజకీయ, సామాజిక పరిస్థితులను బట్టి వ్యూహాలు ఉంటాయి. అందుకు తగ్గట్టు స్థానిక ఎన్నికల్లో జనసేన ప్రభావశీలంగా, మెరుగైన స్థాయిలో నిలబడుతుంది’ అని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. జనసేన ఎమ్మెల్యేలు నియోజకవర్గాలకే పరిమితం కాకుండా వారి ప్రాంతాల్లో జనసేన బలాబలాలను బేరీజు వేసుకుని పోటీ చేసేందుకు తగిన స్థానాలను గుర్తించి పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని నిర్దేశించారు. శాసనసభ ప్రాంగణంలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో గురువారం పవన్‌కల్యాణ్ అధ్యక్షతన జనసేన శాసనసభాపక్ష సమావేశం జరిగింది. మున్సిపల్, పంచాయతీరాజ్ ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. ‘స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున అనుసరించాల్సిన విధివిధానాల రూపకల్పన, క్షేత్రస్థాయిలోని పార్టీ శ్రేణుల ఆలోచనలను ముందుకు తీసుకెళ్లేందుకు 9–11 మంది ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులతో ప్రత్యేక కమిటీ నియమిస్తాం’ అని అన్నారు. ప్రజాప్రతినిధులు చెప్పిన అంశాలు నోట్ చేసుకున్న పవన్‌కల్యాణ్ ఎన్నికల సంసిద్ధతపై వారికి దిశా నిర్దేశం చేశారు. దాడులకు ఎదురొడ్డిన వారి స్ఫూర్తికి విలువ ఇచ్చేలా నిలబడతాం..: ‘జనసైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నాటి పాలకులు ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను నామినేషన్ కూడా వేయనివ్వకుండా అడ్డుకున్నారు. జనసేన నాయకులు ఆ దాడులు, ఒత్తిళ్లకు ఎదురొడ్డి ధైర్యంగా నిలబడి పోటీ చేశారు. వారి స్ఫూర్తికి విలువ ఇచ్చేలా ఈసారి జనసేన నిలబడుతుంది. రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన ఎంత బలంగా నిలబడితే అంత మెరుగైన ఫలితం ఉంటుంది. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన శ్రేణులు ధైర్యంగా నిలబడ్డాయి. ఆ స్ఫూర్తి 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి దోహదపడింది’ అని పవన్‌కల్యాణ్ అన్నారు. కొన్నిచోట్ల ఎమ్మెల్యేలు కూటమి ధర్మానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు: ‘జనసేన పార్టీ ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో కొన్నిచోట్ల ఎమ్మెల్యేలు కూటమి ధర్మానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల పార్టీ శ్రేణుల్లో అసహనం నెలకొంది’ అని పలువురు ఎమ్మెల్యేలు అధినేత దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశాలు తన దృష్టికి వచ్చాయని.. పార్టీ శ్రేణుల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామని పవన్‌కల్యాణ్ అన్నారు. రాజకీయంగా వారిని బలోపేతం చేసేలా ముందుకు వెళ్దామని, వారికి మెరుగైన అవకాశాలు కల్పిద్దామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌నాగబాబు, రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేష్, ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## మోహన్ భగవత్‌కు దౌత్య మర్యాదలు వద్దు..

ఆర్ఎస్ఎస్‌పై ఆంక్షలు విధించాలని అమెరికాకు చెందిన మత స్వేచ్ఛల కమిషన్ (యూఎస్సీఐఆర్ఎఫ్) డిమాండ్ చేసింది. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఈ నెల 29న న్యూయార్క్ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. భగవత్‌తో పాటు ఆర్ఎస్ఎస్ నేతలకు అమెరికా ప్రభుత్వం ఉన్నత స్థాయి దౌత్య మర్యాదలు ఇవ్వొద్దని కమిషన్ సభ్యులు కోరారు. ఆర్ఎస్ఎస్‌కు చెందిన అనుబంధ సంస్థలు భారత్‌లో మైనారిటీలపై దాడులకు పాల్పడ్డాయని యూఎస్సీఐఆర్ఎఫ్ ఛైర్మన్ ఆసిఫ్ మహమూద్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఆర్ఎస్ఎస్ సభ్యుడేనని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ నేతలపై ఆంక్షలు విధించాలని కమిషనర్ జీన్ మిల్స్ సూచించారు. మత స్వేచ్ఛ ఉల్లంఘనలకు బాధ్యులైన ఆర్ఎస్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. మార్చిలో విడుదల చేసిన వార్షిక నివేదికలోనూ భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన యూఎస్సీఐఆర్ఎఫ్.. ఆర్ఎస్ఎస్, రా వంటి సంస్థలపై ఆంక్షలు విధించాలని సిఫార్సు చేసింది. అయితే యూఎస్సీఐఆర్ఎఫ్ ఆరోపణలను భారత్ గతంలోనే ఖండించింది. భారత్‌పై వక్రీకరించిన, ఏకపక్ష చిత్రాన్ని ఆ సంస్థ చూపుతోందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అనుమానాస్పద వర్గాలు, భావజాల కథనాల ఆధారంగా యూఎస్సీఐఆర్ఎఫ్ నివేదికలు తయారవుతున్నాయని విమర్శించింది. భారత బహుళత్వ సమాజంపై తప్పుడు ముద్ర వేసేందుకు ఆ సంస్థ ప్రయత్నిస్తోందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మండిపడ్డారు. అమెరికాలో హిందూ దేవాలయాలపై దాడులు, భారతీయులపై పెరుగుతున్న అసహనాన్ని ముందుగా పరిశీలించాలని సూచించారు.

## సీబీఎస్ఈ 3 భాషల విధానం అమలుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

సీబీఎస్ఈ పాఠశాలల్లో మూడు భాషల విధానం అమలు తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ 2020) అమలును తాము వ్యతిరేకించడం లేదని, అయితే దీనిని అమలు చేసే క్రమంలో విద్యార్థులపై అనవసర ఒత్తిడి పడకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఈ విధానం యొక్క ఆచరణాత్మక అమలుపై మరోసారి సమగ్రంగా అధ్యయనం చేయాలని బోర్డును ఆదేశించింది.

**ఈ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు లేవనెత్తిన ప్రధానాంశాలు:**

ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 10వ తరగతి వచ్చేసరికి మూడో భాషలో కూడా తప్పనిసరిగా బోర్డు పరీక్ష రాయాల్సి రావడం వారిపై అదనపు భారాన్ని మోపడమే అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ప్రస్తుత 6వ తరగతి విద్యార్థులకు ఈ మూడో భాష బోర్డు పరీక్ష నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. అంతేకాకుండా, ఈ విధానాన్ని అసలు 6వ తరగతి నుంచి ప్రారంభించాలా లేక ప్రాథమిక స్థాయిలోనే 3 లేదా 4వ తరగతి నుంచే అమలు చేయాలా అనే విషయాన్ని కూడా పునరాలోచించాలని స్పష్టం చేసింది. పాఠశాలల్లో సరిపడా అర్హత కలిగిన ఉపాధ్యాయుల లభ్యత, పాఠ్యపుస్తకాలు, అవసరమైన మౌలిక వసతుల కల్పనపై స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీని ధర్మాసనం ఆదేశించింది. విద్యార్థులు ఇన్నాళ్లుగా చదువుతున్న విదేశీ భాషల కాంబినేషన్ దెబ్బతినకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది.

## దసరాలో లోకల్ సందడి

స్వర్ణసాగరం విశాఖపట్టణం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో భారీ ఎన్నికల సమరానికి తెరలేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అత్యంత వేగంగా అడుగులు వేస్తోంది. బీసీ రిజర్వేషన్ల సమగ్ర అధ్యయనం కోసం వేసిన డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చింది. అయితే ఆ నివేదికలో సిఫారసు చేసిన దాని కన్నా ఎక్కువగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరోవైపు సెప్టెంబర్ మొదటి వారంలోనే వార్డుల వారీగా తుది ఫొటో ఓటర్ల జాబితాలను ప్రచురించాలని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఆదేశించడంతో కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అంతా అనుకున్నట్లు సాగితే సెప్టెంబర్ చివరి వారం నుంచి అక్టోబర్ నెలల మధ్యలో ఏపీ అంతటా స్థానిక ఎన్నికల హడావుడి రావడం ఖాయంగా కనిపిస్తోందిఈసారి ఎన్నికల నిర్వహణలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఓటర్ల జాబితా ఎంపిక. ఓటర్ల జాబితా సవరణ సుదీర్ఘ ప్రక్రియ వల్ల ఎన్నికల నిర్వహణ ఆలస్యం కాకుండా ఉండేందుకు 2025 నాటి స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రాతిపదికన ఎన్నికలకు వెళ్లాలని ఎస్ఈసీ వ్యూహాత్మకంగా నిర్ణయించింది. పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ, సవరణలతో పాటు ఇప్పటికే బీసీ డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ను మించి దాదాపు 34% వరకు బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ సాంకేతిక, పరిపాలనా ముందడుగులు పరిశీలిస్తే ఎన్నికలను మళ్లీ వాయిదా వేసే ఉద్దేశంలో ప్రభుత్వం లేదని స్పష్టమవుతోంది.కూటమి ప్రభుత్వానికి ఈ స్థానిక ఎన్నికలు తమ రెండు సంవత్సరాల పరిపాలనా పనితీరుకు, ప్రజాదరణకు మొదటి

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# సత్యవేడులో ఘనంగా బీసీల కృతజ్ఞతా సభ

## చంద్రబాబు చిత్రపటానికి భారీ పాలాభిషేకం



**స్వర్ణ సాగరం సత్యవేడు,**

తిరుపతి జిల్లా సత్యవేడు పట్టణంలో నేడు కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ముప్పై నాలుగు శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతగా సత్యవేడు పట్టణంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ఘనంగా కృతజ్ఞతా సభ, పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ కూరపాటి శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు, సత్యవేడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పరుచూరి శివకుమార్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు భారీగా పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

**బీసీలకు సామాజిక న్యాయం కోసం టీడీపీ కృషి:పరుచూరి శివకుమార్**

మండల పార్టీ అధ్యక్షులు పరుచూరి శివకుమార్ మాట్లాడుతూ, బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా రాజకీయంగా ప్రాధాన్యత కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. బీసీలకు ముప్పై నాలుగు శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలు చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో సత్యవేడు నియోజకవర్గంలోని అనేక మంది బీసీ యువత, నాయకులకు సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా రాజకీయంగా ఎదిగే అవకాశాలు లభిస్తాయని తెలిపారు. బీసీల సామాజిక, రాజకీయ అభ్యున్నతికి ఈ నిర్ణయం ఒక ముఖ్యమైన మలుపు అని అన్నారు.సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సుందర రామిరెడ్డి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు రాజకీయ గుర్తింపు కల్పించేందుకు కృషి చేసిందన్నారు. బీసీల హక్కులను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. నాయకత్వంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రూపు రాజకీయాలకు తావులేకుండా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.

**బీసీల్లో కొత్త ఉత్సాహం: మాజీ ఎంపీపీ మస్తాన్**

మాజీ ఎంపీపీ మస్తాన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న రిజర్వేషన్ల నిర్ణయంతో బీసీ వర్గాల్లో కొత్త ఉత్సాహం వచ్చిందన్నారు. బీసీ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పార్టీ చేపట్టే ప్రతి అధికారిక కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలను సరిచూసుకోవడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడుకోవడం ముఖ్యమన్నారు.

**టీడీపీ అంటేనే బీసీలకు అండ:తులసి**

సత్యవేడు నియోజకవర్గ యువత అధ్యక్షులు తులసి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీలకు అండగా నిలిచే పార్టీ, బీసీల గుండె చప్పుడు అని అన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు హయాం నుంచి టీడీపీ బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పిస్తూ వస్తోందన్నారు. బీసీలకు ముప్పై నాలుగు శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ఎంతో మేలు చేసే నిర్ణయమన్నారు. ఎన్టీఆర్ వేసిన పునాదిని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ సోదరులంతా ఐక్యంగా నిలిచి టీడీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు బాబు యాదవ్, అమసారెడ్డి, మాజీ సత్యవేడు మండల పార్టీ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పరమశివం (బాషా),గ్రాజూ చైర్మన్ మోహన్‌రాజ్, సత్యవేడు టౌన్ పార్టీ అధ్యక్షులు కొణయ్య, నాగలాపురం మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పామంజి మురళి (చిన్నా), సత్యవేడు మండల ప్రధాన కార్యదర్శి శివయ్య, తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షులు పామంజి వాసు, కో క్లస్టర్ వెట్టి డేవిడ్ రాజ్ ,జనసేన మండల అధ్యక్షులు రూపేష్, మణి, సీనియర్ నాయకులు, మదనంబేడు మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం రాజు, రవి, బూత్ ఇన్‌చార్జ్‌లు షణ్ముగం, గ్రామ పార్టీ అధ్యక్షులు కోటి, ప్రభాకర్, ముదుకృష్ణయ్య, సత్యవేడు నియోజకవర్గ యువత వైస్ ప్రెసిడెంట్ జగన్, పేరడం జనరల్ సెక్రటరీ శరత్, సత్యవేడు తెలుగు యువత అధ్యక్షులు దిలీప్, మదనంబేడు గ్రామ పార్టీ అధ్యక్షులు మణి, మదనంజెరి గ్రామ పార్టీ అధ్యక్షులు కుమార్, మహేష్, యువ నాయకులు సంపత్, దయ, శీర్‌నంబుదూరు సీనియర్ నాయకులు కట్టయ్య, తిరువెంగళం, రవి, కాదిరివేడు మాజీ సర్పంచ్ కృష్ణయ్య, మణి నాయకుడు, నియోజకవర్గ రైతు విభాగం ఉపాధ్యక్షులు రామ్‌దాస్, సత్యవేడు గ్రాజ సెల్ అధ్యక్షులు సురేష్ తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, సోషల్ మీడియా ప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పౌరుల మధ్య శాంతి మత సామరస్య సద్భావనను పెంపొందించాలి

### లోక్‌ఆధాలత్ జడ్జి. జీ. పద్మ శ్రీ




**నెల్లూరు స్వర్ణ సాగరం ఆగస్టు 20**

కుల,మత, జాతి భేదాలకు అతీతంగా పౌరుల మధ్య శాంతి, మత సామరస్య సద్భావనను పెంపొందించాలని లోక్‌ఆధాలత్ జడ్జి. జీ. పద్మ శ్రీ పేర్కొన్నారు. గురువారం ముత్తుకూరు మండలం లోని మల్లూరు గ్రామం లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న వర్గాల మధ్య ఐక్యత ను బలోపేతం చేయాలన్నారు.ప్రతి సంవత్సరం ఆగష్టు 20వ తేదీన సద్భావన దినోత్సవాన్ని జరుపుకోవటం జరుగుతుంధన్నారు. భిన్నత్వం లో ఏకత్వం అనే భారతదేశ సంప్రదాయాలు, విలువలను నిలబెట్టుకోవాలన్నారు. జాతీయ, ఐక్యత, శాంతి సామరస్యము, యువతి పై ద్రుష్టి పెట్టాలన్నారు. అనంతరం మానవహక్కులు, చట్టాలు గురించి వివరించారు. భాల్య వివాహాలు చట్ట విరుద్ధం అన్నారు. పేదలకు న్యాయం చేయడం కోసం న్యాయ సేవాదికార సంస్థ ఉందని, ఎవ్వరికైనా న్యాయ సహాయం కావాలన్న సంప్రదించవచ్చు అన్నారు. అత్యవసర సమయంలో న్యాయ సలహా టోల్ ఫ్రీ నెంబర్ 15100 కి ఫోన్ చేసి సహాయం పొందవచ్చు అని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో లోక్‌ఆధాలత్ సభ్యులు మూరంరెడ్డి సుబ్బారెడ్డి, ×ఱూ ™ూ నిరంజన్, ూ× కొండారెడ్డి, ×జణూ సుబ్బమ్మ, వీూణూ సుగుణ, =× రమేష్, వేణుగోపాల్, రమణయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

# మానవత శాఖ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ





**కొయ్యలగూడెం స్వర్ణ సాగరం**

మానవతా కొయ్యలగూడెం శాఖ ఆధ్వర్యంలో ఈరోజు శాంతి ర్యాలీ వి ఎస్ ఎన్ కళాశాల నుండి గణపతి సెంటర్ వరకు జరిగింది ఈ కార్యక్రమాన్ని జిల్లా కన్వీనర్ త్రిపుర ప్రారంభించారు, అధ్యక్షులు కొల్లూరి వెంకట రామకృష్ణ (కిషోర్ ), సెక్రెటరీ కొట్టు ఏడుకొండలు, ట్రెజరర్ మట్టే శ్రీను, ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు టుబాకో బోర్డు వైస్ ప్రెసిడెంట్ ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, అదేవిధంగా మానవత సభ్యులు ఉమా, మానవతా చైర్మన్ వి ఎస్ ఎన్ స్వామి పాల్గొన్నారు, ఈ ర్యాలీలో ప్రకాశం కళాశాల విద్యార్థులు వి ఎస్ ఎన్ కళాశాల విద్యార్థులు 100 మంది పాల్గొన్నారు.'

# స్థానిక సంస్థల్లో 34% బీసీ రిజర్వేషన్‌పై హర్షం

## - ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

## కె.వి.బి పురం మండల క్లస్టర్ 4 ఇంచార్జ్ దొరబాబు నాయుడు

**స్వర్ణ సాగరం కె వి బి పురం:**



స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కె.వి.బి పురం మండల క్లస్టర్ 4 ఇంచార్జ్ దొరబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం బీసీల రాజకీయ సాధికారతకు మరింతదోహదపడుతుందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా దొరబాబు నాయుడు మాట్లాడుతూ.. గతంలో స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం 24 శాతానికి తగ్గించిందని ఆరోపించారు. దీంతో బీసీలు అనేక రాజకీయ పదవులు కోల్పోయారని, రిజర్వేషన్లు తగ్గించడం ద్వారా వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేసిందని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం స్థానిక సంస్థల్లో బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చిందని తెలిపారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో 34 శాతం రిజర్వేషన్‌కు ఆమోదం తెలపడం ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ బీసీల అభ్యున్నతికి కృషి చేస్తుందనడానికి ఈ నిర్ణయం మరో నిదర్శనమని ఆయన అన్నారు. రాజకీయంగా బీసీలకు మరిన్ని అవకాశాలు లభించినప్పుడే సామాజికంగా, ఆర్థికంగా కూడా వారు మరింత అభివృద్ధి సాధించగలరని తెలిపారు.స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ అమలుతో బీసీలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు లభిస్తాయని, ప్రజా ప్రతినిధులుగా ఎదిగి తమ వర్గాల అభివృద్ధికి కృషి చేసే అవకాశం కలుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్లకు బీసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

# దోమ కాటును అరికడదాం దోమల ద్వారా వచ్చేవ్యాదులను నివారిద్దాం



**స్వర్ణ సాగరం బైరెడ్డిపల్లి ఆగస్టు 20 :-**

ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా డాక్టర్ సుస్మిత ఆధ్వర్యంలో తీర్థం పిహెచ్ సి నందు దోమపుట్టరాదు దోమ కుట్టరాదు అని ర్యాలీ మరియు ప్రతిజ్ఞ చేయడం జరిగింది .ఈసందర్భంగా డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ చిన్నదోమ కాని దానికాటువల్ల మలేరియా, డెంగ్యూ , చికెన్ గున్యా , జపనీస్ ఎ న్ సేఫా లైటిస్,లింఫాటిక్ పై లేరియా సిస్ వంటి తీవ్రమైన వ్యాదులు వ్యాప్తి చెంద వచ్చుని, అందుకే దోమలనియంత్రణ కేవలం ఆరోగ్య శాఖ భాధ్యతకాదు ప్రతికుటుంభం , పౌరుడు,ప్రతిగ్రామము మరియు ప్రతి పట్టణం భాధ్యత అని చెప్పారు. అలాగే హెచ్ ఈవో కాంతమ్మ మాట్లాడుతూ దోమలు ఎక్కువుగా వుండే నీటితొట్టేలు, కొబ్బరి చిప్పలు, పూలకుండీలు,కూలర్లు, నిర్మాణ ప్రదేశాల్లోనిలిచిన నీరు గుంతల్లో దోమలు అధికంగా ఉంటాయి కాబట్టి ఇవిలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని చెప్పడం జరిగింది,. ఈకార్యక్రమంలో ఎస్ ఎన్ రెడ్డమ్మ,సుమిత్ర, ఆయూబ్ ,రాజారెడ్డి, నవీన, నాగేశ్వరీ, ఆశ శాంతమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**కన్నాపురం స్వర్ణ సాగరం**



కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామంలోని సినిమా హాల్ సెంటర్ నందు రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు పోలవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ బండి విజయభాస్కరరావు ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి,ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి/చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బండి విజయభాస్కరరావు, దేశ పురోగతిలో రాజీవ్ గాంధీ తెచ్చిన సాంకేతిక విప్లవాన్ని, ఆయన ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను మరియు దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు, అనంతరం ప్రజలకు,పార్టీ కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు,ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు దారం సత్తిరాజు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు టి రాణి రత్నప్రభ, నియోజకవర్గ పర్యవేక్షణ మెంబర్ సరియం వెంకటేశ్వరరావు,జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు అమర్తల ఏసు పాదం, కిసాన్ సెల్ అధ్యక్షులు కుంజె భీమరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రవ్వ భీమరాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# "తోటపల్లి గూడూరు' "పల్లె వీక్షణకు" కుదరని "ముహూర్తం" రెండుసార్లు వాయిదా

**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఆగస్టు 20**

గ్రామాలలో మౌలిక వసతులు ప్రధాన సమస్యలు ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో అమలవుతున్న తీరు జిల్లా కలెక్టర్ పరిశీలించాలన్న ప్రభుత్వ నిర్ణయం తో జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆయా గ్రామాలను పల్లె వీక్షణం ద్వారా పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తోటపల్లి గూడూరు ఎంపిక చేసుకోవడం జరిగింది. ఒక పర్యాయం ఈ కార్యక్రమం వాయిదా పడగా తిరిగి ఈనెల 20 ఏర్పాటు చేసుకోవడం జరిగింది కానీ శాసనసభ సమావేశాలు ఉండడంతో సర్వేపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొనలేకపోవడంతో వాయిదా పడింది. ఇప్పటికే రెండుసార్లు కార్యక్రమ ఏర్పాట్లు నిర్వహించిన స్థానిక నేతలు వాయిదా పడడంతో డోలాయమానం లోపడ్డారు

# ఘనంగా ప్రపంచ దోమల దినోత్సవం

**స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండిగ**





మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆగస్టు 20వ తారీఖున ప్రపంచంలో దినోత్సవ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మురళి రెడ్డి, డాక్టర్ ఉదయ్ కుమార్ మరియు ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జ్వరాల పై అవగాహన, దోమల నియంత్రణ పై అవగాహన సదస్సు ఏర్పరిచి ప్రతిజ్ఞ చేయించడం అయినది.1897 ఆగస్టు 20వ తారీఖున సర్ రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త దోమల ద్వారా మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందని కనుగొన్నారు. ఇక అప్పటినుండి దోమలపై నియంత్రణకు కృషి చేస్తూ మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా, మరియు మెదడువాపు వ్యాధి మొదలగు రకాల జబ్బులను చాలావరకు తగ్గించడమైనది.ప్రతి శుక్రవారం ఫ్రైడే పాటించడం ద్వారా ఇంటిలో ఉండే నిల్వ నీటిని పారబోసి మరలా నీటిని స్వచ్ఛంగా పట్టుకోవడం ద్వారా భూమి యొక్క గ్రూప్ లో లార్వాలు ఉపయోగాలు నాశనం అయిపోయి దోమ ఉత్పత్తి కాకుండా ఉంటుంది అలాగే మన ఇంటి చుట్టు పక్కల పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే అనగా ప్లాస్టిక్ కప్పులు టెంకాయ చెప్పులు పనికిరాని రోడ్లు పనికిరాని డబ్బాలు ఎయిర్ కూలర్లు ఇటువంటివన్నీ ఉంచడం వల్ల వాటిలో వర్షపు నీరు నిలిచి దోమలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది.ఈ చిన్ని పాటి చర్యలు మనము చేయకట్టినట్లైతే పెద్ద మార్పు తీసుకుని వచ్చి దోమలు లేని ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని నిర్మించవచ్చు.ప్రతి సంవత్సరం ఈ ప్రపంచ దోమల దినోత్సవం జరుపుకుంటూ ప్రజలలో అవగాహన కల్పించి మనమందరము కలిసి ముందు అడుగు వేసి దోమలను నిర్మూలించగలం, వ్యాధులను నియంత్రించగలం, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ కలిగి ఇతరులకు అవగాహన కలిగించి దోమలు లేని సమాజాన్ని నిర్మించాలని ఈ ప్రపంచంలో దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతున్నది.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు

శుక్రవారం 21 ఆగస్టు 2026

స్వర్ణసాగరం



# విద్యార్థిని విద్యార్థులు మంచి నడవడిక అలవర్చుకోవాలి

## కుల మతాలకు అతీతంగా సమాజంలో మార్పు రావాలి..బ్రహ్మకుమారీస్

**స్వర్ణ సాగరం పూతలపట్టు ఆగస్టు 20**

ఓం శాంతి బ్రహ్మకుమారిస్ వారు నశాముక్త్ భారత అభియాన్ మరియు మిషన్ స్పందన్ వికసిత భారతదేశం కోసం ఒక ముందడుగు అనే కార్యక్రమాన్ని ఈరోజు ఎర్ర చెరువు పల్లె ,ఉన్నత పాఠశాలలో, పాలకల ఉన్నత పాఠశాలలో, మరియు ప్రాథమిక పాఠశాలలో ఐరాల జూనియర్ కళాశాలలో, ఐరాల ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్లు టీచర్లతో కలిసి 1000 మందికీ పైగా వ్యసనముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు వ్యసనాల దుష్ప్రభావాన్ని నష్టాలను తెలిపాము, వ్యసనాలు అంటే కేవలం ధూమపానము మద్యపానం గుట్కాలే కాకుండా ఓవర్ థింకింగ్,నెగిటివ్ థింకింగ్ అవసరానికి మించి ఫోన్ వాడటం టీవీ, సీరియల్ చూడటం డిజిటల్ మీడియా ప్రభావంలో పడి,రాంగ్ రూట్లో వెళ్లడం కూడా వ్యసనం అని తెలిపి,వాటి నివారణకు యోగ, ప్రణాయమము మంచి గుణాల అలవచుకోవటం పాజిటివ్ థింకింగ్, చదువుతోపాటు మన లోపల ఉన్నటువంటి కళలను అనగా పెయింటింగ్ వేయడం చక్కగా పాటలు పాడటం డాన్స్ చేయటం సంగీతము,కంప్యూటర్ నేర్చుకోవడము కరాటి ఆడటము,ముగ్గులు వేయడము, వంట చేయటము పెద్ద



వాళ్లకు పనుల్లో సహాయం చేయటం వీటిల్లో బిజీగా ఉండడం ద్వారా వ్యసనాలకు దూరంగా ఉండి మన కలలను సహకారం చేసు కోవచ్చు అని తెలిపాము పాఠశాలల్లో సరస్వతీ దేవిని కమల పుష్పం పైన కూర్చోబెట్టిన విగ్రహాన్ని పే డతారు దాని అర్థము విద్యార్థులు కమల పుష్ప ని ఆదర్శంగా తీసుకొని కమలం బురదలో ఉంటూ అంటనట్లే ఈ చుట్టూ వ్యసనాల వాతావరణం లో నెగిటివ్ వాతావరణం లో ఉన్నప్పటికీ చెడు సాంగత్యాల వాతావరణంలో ఉన్నప్పటికీ వాటి ప్రభావం మనసు పైన పడకుండా ఉన్నప్పుడే సరస్వతి దేవి ఆశీస్సులతో మనం మన కలలను సహకారం చేసుకోగలుగుతాము ఈ వ్యసనాల వలన మానసికంగా, శారీరకంగా,ఆర్థికంగా ఆరోగ్యపరంగా ,గౌరవప్రదంగా అన్ని రకాలుగా మనము నష్టపోతామని పిల్లలు ఈ దశ నుంచి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని,తోటి విద్యార్థులను స్నేహితులను తల్లిదండ్రులను మరి కుటుంబ సభ్యులను వ్యసనాలకు దూరంగా ఉండేలాగా మంచి మార్గాన్ని చూపించాలని తెలిపాము, వ్యసనముక్త వికసిత భారతదేశ నిర్మాణంలో నా వంతు కృషి చేస్తానని దృఢ నిర్చయంతో ప్రతిజ్ఞ చేయించినాము, ప్రస్తుత జీవన విధానంలో మనిషి చెడు వ్యసనాల బారిన పడడమే కాకుండా ప్రతిరోజు ఏదో ఒక సమయంలో మానసిక ఒత్తిడి టెన్షన్,డిప్రెషన్,కోపము, క్షణికావేశం దుర్భాషలాడటం ఈర్ష-ద్వేషము నిరాశ అత్యాసం సోమరితనం వంటి పలు రకాల సమస్యలకు గురి అవుతున్నారు ఇటువంటి సమస్యల నుండి ఉపశమనం లేక ముక్తి పొందుటకు నిజమైన మానసిక ప్రశాంతత కొరకు ఆరోగ్యకరమైన జీవనశైలికి బ్రహ్మకుమారిస్ వారు నేర్పబడుతున్న ఉచిత సహజ రాజయోగాము ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపాము మానసిక శారీరక ఇబ్బందులు ఉన్నవారు వ్యసనాలకు లోను కాకుండా రాజయోగ సేవా కేంద్రాలను ఉపయోగించుకోవాలని ప్రశాంత జీవితాన్ని గడపాలని బ్రహ్మకుమారిస్ రెడ్డి వీధి, పూతలపట్టు నిర్వాహకురాలు బి కే సుజాత పిల్లలకు పిలుపునిచ్చారు.

# విజలాపురంలో ప్రపంచ దోమల దినోత్సవ ర్యాలీ



**స్వర్ణ సాగరం రామకుప్పం ఆగస్టు 20,**

ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా విజలాపురం పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ కే.పూజిత, డాక్టర్ సాయి శ్రీ, కుప్పం సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూజిత మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా వ్యాపిస్తుందని, పరిశుభ్రత పాటించి నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. "దోమలను నివారిద్దాం ఆరోగ్యాన్ని కాపాడుదాం" అని పిలుపునిచ్చారు. ర్యాలీలో హెల్త్ సిబ్బంది బాలయ్య, ప్రమీల, ఏఎన్ఎంలు అశ్వత, సుకన్య, ఎంఎల్హెచ్పీలు కావ్య, పుష్ప, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డోర్నకల్‌లో ఘనంగా రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు



**స్వర్ణసాగరం డోర్నకల్ ఆగష్టు 20**

డోర్నకల్‌లో భారత మాజీ ప్రధాని భారత రత్న రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు పట్టణ అధ్యక్షులు కాల సుమేర్ జైన్, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ఆధునికీకరణ, సమాచార సాంకేతిక రంగ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం మిఠాయిలు, పండ్లు పంపిణీ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కొండేటి రాజకుమారి హరినాథ్ బాబు, వైస్ చైర్ పర్సన్ మాదా లావణ్య శ్రీనివాస్, మండల అధ్యక్షులు డాక్టర్ బత్తుల శ్రీనివాస్,మాజీ చైర్మన్ వీరన్న, మాజీ వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం,కౌన్సిలర్లు సువర్ణ హరికృష్ణ, గారే రమేష్,వీరన్న,హేమలత, నవీన్, ప్రమీల, కో ఆప్షన్ సభ్యులు శీలం భాగ్యలక్ష్మి శ్రీనివాస్, ఖాదర్ బాబా,కృష్ణ, విమల అశోక్, అంబేద్కర్ సేవా సంఘం అధ్యక్షుడు ఏపూరి రమణయ్య, మైనార్టీ నాయకులు మున్నా,గోపి, పవన్, మేకల రామారావు,సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

# నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

### కమిషనర్ షేక్ ఫజూలుల్లాకు మాజీ ఏఎంసీ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి శుభాకాంక్షలు

### కమిషనర్ ఫజూలుల్లాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి




**నాయుడుపేట(స్వర్ణ-సాగరం)ఆగష్టు20**

తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజూలుల్లాకు జన్మదిన శుభాకాంక్షలు వెల్లు వెత్తాయి.ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ డైరెక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వ కంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ షేక్ ఫజూలుల్లాకు పుష్పగుచ్ఛం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఆయన ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని చంద్రశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు.ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ మంచి గుర్తింపు పొందాలని అభిలషించారు.నాయుడుపేట మున్సిపాలిటీ అభివృద్ధిలో కమిషనర్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు, అధికారులు, నాయకులు కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.జన్మదిన వేడుకలు ఆత్మీయ వాతావరణం లో నిర్వహించి కమిషనర్ షేక్ ఫజూలుల్లాను అభినందించారు.

# ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం ఫోక్సో కేసు నమోదు

**పెళ్లకూరు స్వర్ణ సాగరం ఆగస్ట్ 20.**

మండలంలోని చిల్లకూరు వడ్డీ పాలెం గ్రామానికి చెందిన యనమల పాపయ్య అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన ఆరేళ్ల చిన్నారిపై గత నాలుగు రోజులుగా అత్యాచారం జరుపుతున్నాడు. చిన్నారికి మాయమాటలు చెప్పి, బిస్కెట్లు నేరేడు పండ్లు కొనిస్తారని నమ్మబలికించి ఓ మిద్ది పైకి తీసుకెళ్లి అత్యాచారం చేస్తుండగా చిన్నారి తల్లి చూసి స్థానికులకు తెలియజేసింది. స్థానిక మహిళలంతా కలిసి పాపయ్యను విద్యుత్ స్తంభానికి కట్టేసి పిడుగులు గుద్దారు. ఈ విషయమై చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడుపై ఫోక్స్ షోకేసు నమోదు చేసిన పోలీసులు చిన్నారిని చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# దోమలతో ప్రాణానికే ముప్పు... నివారణే శ్రీరామ రక్ష



**కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 20**

దోమకాటు వల్ల పొంచి ఉన్న ప్రమాదాలు వాటి ద్వారా వ్యాపించే ప్రాణాలు ప్రాణాంతక వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని వైద్యాధికారి డాక్టర్ వెంకట ఫణి తెలిపారు.ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా గురువారం కనిగిరి ప్రభుత్వం వైద్య శాల నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు మలేరియా సబ్ యూనిట్ అధికారి రామంజనేయులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు."దోమలను నివారిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుదాం" అనే నినాదంతో వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దోమల ఉత్పత్తి కేంద్రాలను అరికట్టడానికి ఇంటి పరిసరాలను పరిశుభ్రముగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, బోదకాలు, మెదడువాపు వంటి దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలకు వివరించారు.ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమతెరలు వినియోగించాలని, ప్రతి శుక్రవారం "ఫ్రైడే డ్రై డే" పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వెంకట ఫణి ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కన్నాపురంలో పి4 కార్యక్రమం 17 మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

### ఏపీ స్పోర్ట్స్ ఆధారిటి డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి



**కన్నాపురం స్వర్ణ సాగరం**

పోలవరం నియోజకవర్గంలోని కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామంలో పి4 కార్యక్రమం కింద రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మాజీ ఏపీడా డైరెక్టర్ గొడవర్తి విద్యాసాగర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో 17 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు.ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, వ్యాపార రంగాల్లో సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళల సాధికారత కోసం తన వంతు బాధ్యతగా ఇప్పటికే పోలవరం నియోజకవర్గంలో 100 మందికి పైగా మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.రానున్న రోజుల్లో మరింత మంది మహిళలకు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కుటుంబాలను గుర్తించి వారికి అభివృద్ధి అవకాశాలు కల్పించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొడవర్తి వెంకటరత్న కుమారి, ఎంపీటీసీలు బాలాజీ, కాగితాల గణపతి, సొసైటీ అధ్యక్షుడు మేని వీరరాజు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బొమ్మ వెంకటరామయ్య, గంటలయ్య, నాగేష్, మడకం వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, యువ ప్రొఫెషనల్ జగదీశ్వర్ రావు, పి4 ప్రతినిధులు సాయిరాజేంద్ర, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# హోమియోపతి ఉచిత వైద్య శిబిరాలు




**కొయ్యలగూడెం స్వర్ణ సాగరం**

కొయ్యలగూడెం మండల కేంద్రంలోని సాయిబాబా గుడి వద్ద ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు హోమియోపతి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ లీలా సౌజన్య తెలిపారు, హోమియోపతి వైద్య విధానం వల్ల కలిగే ప్రయోజనాలు,దీర్ఘకాలిక వ్యాధులకు ఇది అందించే సురక్షితమైన చికిత్సల గురించి ప్రజలకు వివరించినట్లు ఆమె పేర్కొన్నారు,ఈ సందర్భంగా డాక్టర్ లీలా సౌజన్య మాట్లాడుతూ కొయ్యలగూడెం మండల ప్రజలందరూ ఈ అవగాహన క్యాంపులను మరియు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# బంగారు కుటుంబాలకు చేయూతనిస్తున్న P4 పథకం

**స్వర్ణ సాగరం రామకుప్పం ఆగస్టు 20,**



పేదరికాన్ని నిర్మూలించాలన్న సంకల్పంతో సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ా4 పథకం రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతోందని రామకుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ సి.వెంకటరమణ ఆంజనేయ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తీమ్మసముద్రం గ్రామంలో మేఘ ఇంజనీరింగ్ సహకారంతో ా4 పథకం లబ్ధిదారు విమలమ్మకు చిల్లర దుకాణం కోసం రూ.40,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ా4 ద్వారా ఆర్థికంగా వెనుకబడిన బంగారు కుటుంబాలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం, కంపెనీలు, దాతలు కలిసి పేద కుటుంబాలను ఆదుకుంటున్నారని తెలిపారు. ఆటోలు, దుకాణాలు, కుట్టు మిషన్ల రూపంలో ఇప్పటికే వేలాది కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న మేఘ ఇంజనీరింగ్ కృష్ణారెడ్డి మరియు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మెగా ఇంజనీరింగ్ కంపెనీ ఏరియా మేనేజర్ వినాయక రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి రవిరెడ్డి, ముఖ్య నేతలు విజయ్ కుమార్ రెడ్డి మంజునాథ్ రెడ్డి, రామలింగారెడ్డి, అల్లి శ్రీను, సుబ్బన్న, లక్ష్మీనారాయణ,సైదాబీ, జ్యోతి , పార్టీ నేతలు పాల్గొన్నారు.

# హెచ్ఐవీ..ఎయిడ్స్‌పై గ్రామాల్లో అవగాహన

**నాయుడుపేట,(స్వర్ణ-సాగరం)ఆగస్టు 20:**

నాయుడుపేట మండలంలోని తిమ్మాజికండ్రిగ, తుమ్మూరు గ్రామాల్లో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, దిశా విభాగం సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.నవజీవన్ ఆర్గనైజేషన్ సి.సి. పి.యు. ప్రాజెక్టు ఆధ్వర్యంలో 'ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి. క్యాంపెయిన్'లో భాగంగా 'మన సంస్కృతి కళా సంస్థ' కళాబృందం అవగాహన కల్పించింది. హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ, లక్షణాలు, చికిత్సతో పాటు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకూడదని ప్రజలకు వివరించారు.సుఖవ్యాధులు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, కండోమ్ వినియోగం, ఏఆర్‌టీ మందులపై అవగాహన కల్పించారు.హెచ్ఐవీఎయిడ్స్ చట్టం--2017,ఏపీ శాక్స్ యాప్,స్వీయ ప్రమాద అంచన క్యూఆర్ కోడ్ తదితర అంశాలను వివరించారు.అవసరమైన వారికి 1097 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం, సహాయం పొందవచ్చని సూచించారు .కార్యక్రమంలో కళాసంస్థ సభ్యులు, ప్రాజెక్టు సిబ్బంది పాల్గొనగా, సుమారు 160 మంది ప్రజలు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన పొందారు.ఈ కార్యక్రమంలో కళాసంస్థ సభ్యులు కె.రెడ్డప్ప,ఎన్. సుబ్రహ్మణ్యం, పి. అంజయ్య, ఎస్.హరినాథ్, ప్రాజెక్టు మేనేజర్ కె. బాలాజీ,ఏఎన్ఎం జి.శ్రీలత, సాయిలక్ష్మి,పి.ధనలక్ష్మి,పీఈలు ఓఆర్‌డబ్ల్యూలు ఎం. పాల్గొన్నారు.గ్రామాలకు



చెందిన సుమారు 160 మంది ప్రజలు కార్యక్రమం లో పాల్గొని హెచ్ఐవీఎయిడ్స్‌పై అవగాహన పొందారు.

# ఎస్ ఐ ఆర్ మార్గదర్శకాలను అనుసరించాలి



**స్వర్ణ సాగరం పూతలపట్టు ఆగస్టు 20**

వాటర్ జాబితా పరిశీలకులు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున

ఓటరు జాబితా తయారీ, సవరణ, నమోదు, తొలగింపు వంటి ప్రక్రియలకు సంబంధించి ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని నిబంధనలు మరియు ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించాలి.

జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు మరియు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున ఓటరు జాబితా తయారీ, సవరణ, నమోదు, తొలగింపు వంటి ప్రక్రియలకు సంబంధించి ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని నిబంధనలు మరియు ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించాలి అనిజిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు మరియు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం ఐరాల మండలంలోని, కాణిపాకం లోని గ్రామ సచివాలయం నందు ఓటర్ల జాబితా తయారీ నోటీసుల విచారణ కార్యక్రమాన్ని బి ఎల్ వో లు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఖ. మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు నాయుడు, ఈ ఆర్ ఓ వెంకట సునీల్ తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా పరిశీలికలు మాట్లాడుతూ పూతలపట్టు నియోజకవర్గంలో కాణిపాక గ్రామ సచివాలయం నందు 45 మంది ఓటర్లకు నోటీసులు అందజేయడం జరిగిందని. మొదటి విడత రానివారికి రెండో విడత కూడా నోటీసులు అందజేయాలని దీూా లను ఆదేశించారు. ఓటర్‌సమర్పించిన ధ్రువపత్రాలు స్వయంగా ధృవీకరించినవి (ెావశ్రీట-ఫ్వర్‌వ‌ం) అయి ఉండాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, మహేశ్వరి, బిఎల్వోలు పాల్గొన్నారు.

# శక్తి యాప్‌పై అవగాహన కల్పించిన చిత్తూరు జిల్లా శక్తి టీం పోలీసులు.





**చిత్తూరు.స్వర్ణసాగరం. ఆగస్టు 20**

చిత్తూరు జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ డూడి,ఆదేశాల మేరకు, మహిళా డీఎస్పీ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో శక్తి బృందాలు మరియు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీ మోహన్ ఈరోజు చిత్తూరు పట్టణంలోని కృష్ణవేణి మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, బాల్యవివాహం ఒక పెద్ద సామాజిక సమస్య అని, బాలికలకు 18 సంవత్సరాలు పూర్తికాకముందే వివాహం చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల బాలికల చదువు మధ్యలోనే ఆగిపోవడం, ఆరోగ్య సమస్యలు ఎదురుకావడం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని వివరించారు. బాలికలు తమ చదువుపై దృష్టి సారించి, ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.పోక్సో చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఇలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.ఈవ్ టీజింగ్‌కు పాల్పడటం చట్టవిరుద్ధమని, మహిళలు, బాలికలను వేధించే వ్యక్తులపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. విద్యార్థినులు ఎవరైనా తమను వేధించినా, వెంబడించినా లేదా అసభ్యంగా ప్రవర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో 112 ఎమర్జెన్సీ నంబర్‌ను సంప్రదించాలని, పిల్లల రక్షణ కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. మహిళలకు సంబంధించిన సమస్యలు, వేధింపులపై 181 మహిళా హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చని అవగాహన కల్పించారు.మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందించిన శక్తి యాప్ ఎంతో ఉపయోగకరమైనదని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్‌లోని ఎస్ఓఎస్ సౌకర్యాన్ని వినియోగించడం ద్వారా పోలీసులకు సమాచారం అందించవచ్చని వివరించారు. మహిళలు, బాలికలు తమ భద్రత కోసం శక్తి యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని సూచించారు.మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా గంజాయి వంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల విద్య, ఆరోగ్యం, కుటుంబ జీవితం మరియు భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, స్నేహితుల ఒత్తిడికి లోనై డ్రగ్స్‌ను ప్రయత్నించవద్దని విద్యార్థులకు సూచించారు.మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, ఇందుకోసం 1972 హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన మరియు బాధ్యతాయుతమైన జీవితాన్ని గడపాలని సూచించారు.విద్యార్థులు తమకు ఎదురయ్యే సమస్యలను దాచిపెట్టకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులతో పంచుకోవాలని, మహిళలు మరియు బాలికల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ వెంకటేశ్వరులు,డీఐఈఓ చిత్తూరు ఏ. రఘుపతి, కళాశాల ప్రిన్సిపాల్ ఏ. సరిత,ఈగల్ టీం సభ్యులు కుమార్ మరియు గిరి,శక్తి టీం సిబ్బంది మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

# కోఆప్షన్ సభ్యులకు ఘన సన్మానం

**స్వర్ణ సాగరం డోర్నకల్ ఆగస్టు 20**



డోర్నకల్ అంబేద్కర్ భవన్‌లో గురువారం డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కోఆప్షన్ సభ్యులకు ఘన సన్మానం నిర్వహించారు. కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన షేక్ ఖాదర్ బాబా, శీలం భాగ్యలక్ష్మి శ్రీనివాస్, బాసిక విమల అశోక్, ఏపూరి కృష్ణలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన కోఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా మున్సిపాలిటీలోని మైనార్టీలు, మహిళలు, వెనుకబడిన వర్గాలు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పాలకవర్గం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ సూచనలు, ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. పదవి కంటే ప్రజల నమ్మకమే ముఖ్యమని, తమకు అప్పగించిన బాధ్యతను ప్రజా ప్రయోజనాల కోసం సమర్థవంతంగా వినియోగిస్తామని తెలిపారు.డోర్నకల్ పట్టణ అభివృద్ధిలో ఎమ్మెల్యే రామచంద్రనాయక్ నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు స్థానికంగా నెలకొన్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని చెప్పారు. కోఆప్షన్ సభ్యులుగా తమకు లభించిన అవకాశాన్ని ప్రజా సేవకు ఉపయోగించుకుంటామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులు పార్టీకి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని ఆకాంక్షించారు. తమకు అప్పగించిన బాధ్యతలను ప్రజా సేవకు వేదికగా మార్చుకుని డోర్నకల్ మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొండేటి రాజకుమారి హరినాథ్ బాబు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాలా సుమేర్ జైన్, మాజీ మున్సిపల్ చైర్మన్ వీరన్న, వార్డు కౌన్సిలర్లు సువర్ణ హరికృష్ణ, బాదావత్ హేమలత, తేజావత్ నవీన్, బాదావత్ వీరన్న, గారే రమేష్, రామ్ కోటేష్, సంధ్య, బానోత్ ప్రమీల రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏపూరి రమణయ్య, దబ్బా శ్రీను,మున్నా, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గుడ్ మార్నింగ్ పై కూటమి నేతలు, కన్నెర్ర





## తగ్గేదేలే అంటూ దూసుకెళ్లిన కామిరెడ్డి

**పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు 20.**



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని గురువారం పునబాక గ్రామంలోని కోటమ్మ నాయకులు అడుగున అడ్డంకులు సృష్టించి అడ్డుకున్నారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమం ద్వారా గ్రామంలో పర్యటించి కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు ఇబ్బందులు తెలుసుకుంటూ, జగనన్న పాలనలో అందిన సంక్షేమ ఫలాలు గురించి వివరిస్తూ ముందుకు వెళుతున్న కామిరెడ్డిని పునపాక గ్రామంలో కూటమి నాయకులు అడ్డుకొని గందరగోళం సృష్టించారు. అయితే సత్యనారాయణ రెడ్డి వర్గీయులు ధీటుగా సమాధానం ఇస్తూ ముందుకు తీసుకెళ్లారు. ఎట్టకేలకు నాయుడుపేట సీఐ సంగమేశ్వర రావు ఓజిలి పెళ్ళకూరు మండలాల ఎస్సైలు పోలీసుల సమక్షంలో పలువురు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను అదుపులోకి తీసుకుని దొరవారిసత్రం పోలీస్ స్టేషన్ కు తరలించారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని ముగించుకుని ఇంటికి చేరుకున్న సత్యనారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడారు. జగనన్న ముఖ్యమంత్రి కావడమే ధ్యేయంగా చేపట్టిన గుడ్ మార్నింగ్ కార్యక్రమం ఎవరికీ ఇబ్బంది కష్టాలు లేకుండా జగనన్న పాలనలో అందిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అయితే గుడ్ మార్నింగ్ కార్యక్రమానికి వచ్చిన విశేష స్పందనను చూసి ఓర్వలేని కోటమ నాయకులు అడుగడుగునా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఓవరాక్షన్ చేస్తూ కూటమి నాయకులు చేసిన దౌర్జన్యాలను పట్టించుకోకుండా శాంతియుతంగా చేస్తున్న గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్సిపి నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం అన్యాయం అన్నారు. రోజులు ఒకే మాదిరిగా ఉండవని పోలీసులు దౌర్జన్యకారులకు అండగా నిలవడం అన్యాయం అని మళ్లీ జగనన్న సుప్రభాతం వస్తుందని అందులో ప్రతి ఒక్కరికి తిరిగి మూల్యం చెల్లించే రోజు కచ్చితంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన పోలీసులు పార్టీ మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం, మాజీ సర్పంచ్ పగడాల హరిబాబు రెడ్డి, వైయస్ఆర్సీపీ నాయకులు పిల్లిమెట్ట మురళి, రమణారెడ్డి రాజారెడ్డి, పాపయ్య తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వందల పై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు.

# జిల్లా లోని శక్తి టీమ్స్‌తమహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి




అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ మహబూబ్ బాష.

**చిత్తూరు.స్వర్ణసాగరం. ఆగస్టు 20**

చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా మహిళలు, చిన్నారుల భద్రత కోసం పనిచేస్తున్న శక్తి టీమ్స్‌తో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మహబూబ్ బాష చిత్తూరు లోని మహిళా పోలీస్ స్టేషన్ నందు సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాస రావు సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో మహిళలు,బాలికలు మరియు చిన్నారుల భద్రతకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై శక్తి టీమ్స్‌కు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ గారు మాట్లాడుతూమహిళలు,బాలికలు మరియు చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, క్షేత్రస్థాయిలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని శక్తి టీమ్స్‌కు సూచించారు. పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్‌స్టాండ్లు వంటి ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రతిరోజూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.ప్రతి రోజు ప్రజలకు శక్తి యాప్ ను డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పించి, అత్యవసర సమయంలో దాాా సౌకర్యాన్ని ఎలా వినియోగించుకోవాలో వివరించాలని సూచించారు. మహిళలు తమ భద్రత కోసం అందుబాటులో ఉన్న సాంకేతిక సౌకర్యాలను వినియోగించుకునేలా ప్రోత్సహించాలన్నారు.మిస్సింగ్ మరియు ఎలోప్‌మెంట్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ముఖ్యంగా బాలికల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి కేసును సున్నితంగా పరిగణించి, అవసరమైన శాఖల సమన్వయంతో బాధితులను సురక్షితంగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అత్యాచారం మరియు పోకసో కేసుల్లో చట్టపరమైన నిబంధనల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నివారణకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టి, అనుమానాస్పద పరిస్థితులను ముందుగానే గుర్తించాలని తెలిపారు. పాఠశాలల్లో చిన్నారులకు గుడ్ టచ్ -- బాడ్ టచ్ పై అవగాహన కల్పించాలని, పిల్లలపై వేధింపులు లేదా దుర్వినియోగం జరిగినప్పుడు చైల్డ్ హెల్ప్లైన్ 1098ను సంప్రదించేలా తెలియజేయాలని సూచించారు.బేటీ బచ్చావో -- సేవ్ ఫిమేల్ చైల్డ్ కార్యక్రమం ద్వారా ఆడపిల్లల రక్షణ,విద్య ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.పాఠశాలకు వెళ్లని స్కూల్ డ్రాపఔట్ పిల్లలను గుర్తించి,వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి పాఠశాలకు పంపేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు సే నో టూ డ్రగ్స్ కార్యక్రమాల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని, మాదకద్రవ్యాలపై సమాచారం కోసం 1972 హెల్ప్‌లైన్ గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు.అదేవిధంగా సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.మహిళల సమస్యలు, వేధింపులపై సహాయం కోసం ఉమెన్ హెల్ప్లైన్ 181, మహిళలకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయం, కౌన్సెలింగ్ మరియు ఇతర సేవల కోసం వన్ స్టాప్ సెంటర్ గురించి ప్రజలకు వివరించాలని సూచించారు.అలాగే లోకల్ ఐసీగ్స్ సేవలు,మహిళల భద్రత, చట్టపరమైన హక్కులు మరియు అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్లపై దక్రా డిడబ్లుసి ఆర్ ఏ మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.వీధి కూడళ్లలో భిక్షాటన చేస్తున్న పిల్లలు, మహిళలను గుర్తించి,వారి పరిస్థితులను పరిశీలించి సంబంధిత శాఖల సహకారంతో అవసరమైన రక్షణ, సహాయం అందేలా చర్యలు చేపట్టాలని అడిషనల్ ఎస్పీ సూచించారు.శక్తి టీమ్స్ కేవలం అవగాహన కార్యక్రమాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో మహిళలు, బాలికలు మరియు చిన్నారుల సమస్యలను గుర్తించి, అవసరమైన సందర్భాల్లో పోలీస్, విద్య, సంక్షేమ మరియు ఇతర సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పరిష్కారం చూపాలని సూచించారు.మహిళలు, బాలికలు మరియు చిన్నారుల భద్రతకు సంబంధించి ప్రతి కార్యక్రమాన్ని బాధ్యతతో నిర్వహిస్తూ, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేలా పనిచేయాలని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మహబూబ్ బాష శక్తి టీమ్స్‌కు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో మహిళా పోలీస్ డీఎస్పీ శ్రీనివాస రావు, మహిళా స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీ మోహన్, మరియు జిల్లా శక్తి టీమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.



swarna sagaram_Swarna sagaram.qxd 8/20/2026 10:56 PM Page 5



# జిల్లాలో మామిడి పంట పండించిన ప్రతి రైతు వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



చిత్తూరు.స్వర్ణసాగరం ఆగస్టు 20

జిల్లాలో మామిడి పంట పండించిన ప్రతి రైతు పంటకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత కలిగిన రైతుల జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారులతో మామిడికాయల సేకరణ పురోగతి, ప్రభుత్వం అందించే సబ్సిడీ, అర్హులైన రైతుల గుర్తింపు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన రైతులకే రూ.4 మద్దతు ధర అందేలా క్షేత్రస్థాయిలో ముమ్మర పరిశీలన కార్యక్రమం వేగవంతం చేయాలని ఆదేశించారుతోతాపురి మామిడి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కిలోకు రూ.4 మద్దతు ధరను అర్హులైన రైతులకే అందించేందుకు అందరము కలిసికట్టుగా కృషి చేయాలని తెలిపారుమద్దతు ధర చెల్లింపుల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఫ్యాక్టరీలు, రాంపులు, మండల స్థాయి అధికారులు, రైతు భరోసా కేంద్రాల ద్వారా సేకరించిన వివరాలను సమగ్రంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాల న్నారు ఫ్యాక్టరీలకు తోతాపురి మామిడి సరఫరా చేసిన రైతుల వివ రాలను సేకరించడంతో పాటు భూమి పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్ తదితర వివరాల ప్రతులను పరిశీలించాలి.ఒకే ట్రాక్టర్ నంబరుతో ఒకే రోజున రెండు, మూడు సార్లు మామిడిని ఫ్యాక్టరీలకు సరఫరా చేసినట్లు ఉన్న రికార్డులను కూడా తనిఖీ చేయాలన్నారు కొన్ని రాంపుల్లో ఒక్కో రైతు పేరుతో భారీ మొత్తంలో మామిడి సరఫరా చేసినట్లు నమోదైన వివరాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. గ్రామ స్థాయిలో రైతుల జాబితాలను ప్రదర్శించడం, అభ్యంతరాలను స్వీకరించడం, రైతుల నుంచి అవసరమైన పత్రాలు తీసుకోవడం, భూమి వివరాలతో సరఫరా బిల్లులను సరిపోల్చడం, ఈ–క్రాప్ నమోదును పరిశీలించడం వంటి ప్రక్రియలు వేగంగాజరగాలన్నారు. అర్హత గల రైతుకు అందించే సబ్సిడీ పారదర్శకంగా, నిజమైన లబ్ధిదారులకు చేరేలా ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. ఇందుకోసం మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రం ఆర్ఎస్కె సిబ్బంది సంయుక్త బృందాలుగా ఏర్పడి ప్రతి గ్రామంలో మామిడి పంట పండించిన రైతులను గుర్తించాలని సూచించారు. సెప్టెంబర్ 5వ తేదీ లోపు జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు.మామిడి పంటకు సంబంధించిన ప్రతి నమోదును ఈ–క్రాప్ వివరాలతో సరిపోల్చి, అవసరమైన చోట భౌతిక పరిశీలన నిర్వహించాలని తెలిపారు. కేవలం ఈ–క్రాప్ నమోదుపైనే ఆధారపడకుండా, క్షేత్రస్థాయిలో పంట వాస్తవంగా ఉందా లేదా అనే అంశాన్ని కూడా నిర్ధారించాలని చెప్పారు. ఈ–క్రాప్‌లో నమోదు లేకపోయినా భౌతికంగా మామిడి పంట ఉన్నట్లయితే సంబంధిత నిబంధనల ప్రకారం ఈ–క్రాప్ నమోదు పూర్తి చేసి అర్హత కల్పించాలని సూచించారు. అలాగే ఈ–క్రాప్‌లో నమోదు ఉండి క్షేత్రస్థాయిలో కూడా పంట ఉన్న రైతులను అర్హులుగా పరిగణించాలని తెలిపారు.ఈ–క్రాప్‌లో రైతు పేరు నమోదై ఉండి రైతు మరణించిన సందర్భాల్లో, వారి కుటుంబ సభ్యులు పంటను విక్రయించి ఉంటే మరణ ధ్రువీకరణ పత్రం, రెవెన్యూ శాఖ ధ్రువీకరణ, ఆధార్ తదితర ఆధారాలను పరిశీలించి, నిబంధనల మేరకు అర్హత నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు.మామిడి పంట పండించిన ఒక్క రైతు కూడా ప్రభుత్వ సహాయానికి దూరం కాకుండా ప్రతి కేసును నిష్పక్షపాతంగా పరిశీలించాలని, అర్హులైన రైతులందరికీ సబ్సిడీ అందేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.జిల్లా వ్యవసాయ అధికారి మురళి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సతీష్, ఆర్టికల్చర్ అధికారి కోటేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఓటు హక్కు ఉండేలా చర్యలు





## జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు మల్లికార్జున

చిత్తూరు.స్వర్మసాగరం. ఆగస్టు 20

చిత్తూరు జిల్లాలో ఎస్ఐఆర్–2026 (రా×=–2026) ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాలో గుర్తించిన అనామలీస్, నో మ్యాపింగ్ కేసులకు సంబంధించి నోటీసులు జారీ చేసి, నిర్దిష్ట తేదీ, సమయం, ప్రదేశాల్లో విచారణ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు మల్లికార్జున, ఐఏఎస్ తెలిపారు.గురువారం చిత్తూరు పట్టణంలోని సంజీవ్ గాంధీ నగర్‌లోని సరస్వతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పోలింగ్ స్టేషన్ నంబర్ 65 వద్ద నిర్వహించిన ఓటర్ల జాబితా విచారణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1.34 లక్షలకు పైగా అనామలీస్, నో మ్యాపింగ్ కేసులకు సంబంధించి విచారణ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.నోటీసులు అందుకున్న వ్యక్తులకు నిర్దిష్ట తేదీ, సమయం, ప్రదేశాన్ని కేటాయించి విచారణ నిర్వహిస్తున్నామని, చిత్తూరు పట్టణంలోని ఈ పోలింగ్ స్టేషన్‌లో సుమారు 50 మంది నోటీసులు అందుకున్న వ్యక్తులు అవసరమైన ఆధారాలతో విచారణకు హాజరైనట్లు తెలిపారు.విచారణ సందర్భంగా బీఎల్ఓలు, ఏఈఆర్ఓ, ఈఆర్ఓ, డీఆర్ఓ అధికారులు అందుబాటులో ఉండి, ఓటర్లు సమర్పించిన ఆధారాలను పరిశీలిస్తున్నారని చెప్పారు. అనామలీస్ కేసుల్లో ఓటరు పేరు, వయస్సు, స్పెల్లింగ్ తదితర వివరాల్లో ఏవైనా వ్యత్యాసాలు ఉన్నాయా అనే అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నో మ్యాపింగ్ కేసుల్లో సంబంధిత ఓటరు ఎందుకు నో మ్యాపింగ్ కింద ఉన్నారు, అందుకు సంబంధించిన ఆధారాలను సమర్పించారా అనే అంశాలను పరిశీలిస్తున్నామని వివరించారు.సరైన ఆధారాలు సమర్పించిన కేసుల్లో వాటిని మళ్లీ స్కాన్ చేసి ఈసీఐ పోర్టల్‌లో వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. విచారణ ప్రక్రియ పారదర్శకంగా, పక్కాగా జరుగుతున్నదనే దానికి ఆధారంగా విచారణకు హాజరైన ఓటరుతో బీఎల్ఓ కలిసి ఉన్న ఫొటోను కూడా అప్‌లోడ్ చేసే విధంగా ఈసీఐ ప్రత్యేక అస్యూరెన్స్ మెకానిజాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 107 దరఖాస్తులను విచారణ నిర్వహించగా,94 వినతలను పరిష్కరించడం జరిగిందని తెలిపారు.విచారణకు హాజరైన ఓటర్లతో స్వయంగా మాట్లాడామని, విచారణ ప్రక్రియపై వారు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు.సెప్టెంబర్ 21లోపు జిల్లావ్యాప్తంగా నోటీసులు జారీ చేసిన అన్ని కేసుల్లోనూ విచారణ ప్రక్రియను పూర్తి చేస్తామని మల్లికార్జున, ఐఏఎస్ తెలిపారు. మొదటి విచారణకు ఎవరైనా హాజరు కాకపోతే వారికి రెండోసారి కూడా నోటీసులు జారీ చేసి విచారణకు అవకాశం కల్పిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డిఆర్ఓ కె మోహన్ కుమార్,చిత్తూర్ ఆర్డీవో శ్రీనివాసులు నాయుడు, ఎన్నికల డిప్యూటీ ఎమ్మార్వో హిమగిరి, మున్సిపాలిటీ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం లో లాడ్జీలు హోటల్స్ తనిఖీలు

కాణిపాకం.స్వర్ణసాగరం. ఆగస్టు 20



చిత్తూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కాణిపాకం పోలీస్ స్టేషన్ ఎస్సై మరియు సిబ్బందితో కలిసి కాణిపాకం పట్టణ పరిధిలోని లాడ్జీలు, హోటల్స్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించడం జరిగినది.ఈ తనిఖీలలో భాగంగా లాడ్జీలలో నిర్వహిస్తున్న రికార్డులను, రిజిస్టర్లను, లాడ్జీలలో బస చేస్తున్న వ్యక్తుల వివరాలను పరిశీలించడం జరిగినది. అద్దెకు దిగే వారి యొక్క ఆధార్ కార్డులు, ఐడి ప్రూఫ్ లు తప్పనిసరిగా తీసుకోవాలని, రిజిస్టర్ లో పూర్తి వివరాలు నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించడం జరిగినది.అదేవిధంగా లాడ్జీల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకొని అవి 24 గంటలు పని చేసే విధంగా చూసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపించినా లేదా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని లాడ్జీ యజమానులకు, నిర్వాహకులకు సూచనలు ఇవ్వడం జరిగినది. నిబంధనలు పాటించని లాడ్జీలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడునని కాణిపాకం ఎస్సై నరసింహులు హెచ్చరించడం జరిగినది.

## ఘనంగా మాజీ మంత్రి రెడ్యానాయక్ జన్మదిన వేడుకలు

- ఉగ్గంపల్లిలో పండుగ వాతావరణం
- భారీగా తరలివచ్చిన తెరాస శ్రేణులు
- రెడ్యానాయక్‌ను సత్కరించిన యువనేత కాడెం ప్రశాంత్



**స్వర్ణ సాగరం డోర్నకల్:** రాజకీయ దురంధరుడు మాజీ మంత్రి డిఎస్ రెడ్యానాయక్ 74వ జన్మదిన వేడుకలు ఆయన స్వగ్రామమైన ఉగ్గంపల్లిలో అత్యంత వైభవంగా జరిగాయి.డోర్నకల్ మండలంచిలుకోడు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మండల యువజన నాయకుడు కాడెం ప్రశాంత్ గౌడ్ ప్రత్యేకంగా పాల్గొని మాజీ మంత్రికి పుష్పగుచ్ఛం అందించి,శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ప్రశాంత్ గౌడ్‌ను దగ్గరకు తీసుకున్న మాజీమంత్రి రెడ్యానాయక్ భుజం తట్టి అభినందించారు.భవిష్యత్తులో ప్రశాంత్ ఒక గొప్ప నాయకుడిగా ఎదుగుతావని ఆశీస్సులు అందజేశారు.

## చిత్తూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన తెదేపా నేతలు







చిత్తూరు.స్వర్ణసాగరం. ఆగస్టు 20

చిత్తూరు నియోజకవర్గంలోని భూములకు సాగునీరు అందించే లక్ష్యంతో.. పెండింగ్ లో ఉన్న నీవా బ్రాంచ్ కెనాల్ కు రాష్ట్ర ప్రభుత్వం రూ.105 కోట్లు మంజూరు చేస్తూ క్యాబినెట్ సమావేశంలో ఆమోదించడంపై తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ.. గురువారం చిత్తూరు గాంధీ విగ్రహ కూడలిలోని స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుమార్, తెదేపా నగర అధ్యక్షుడు నరేష్ చౌదరి, మాజీ మేయర్ ఎస్ అముద, మాజీ డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి లు మాట్లాడుతూ.చిత్తూరు నగరంతో పాటు, నియోజకవర్గంలోని మండలాల సాగునీటి అవసరాల కోసం హంద్రీనీవా బ్రాంచ్ కెనాల్ కు నిధులు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ నిరంతరం కృషి చేస్తున్నారని.. అసంపూర్తిగా ఉన్న నీవా బ్రాంచ్ కాలువ కోసం నిధులు సాధించడం శుభపరిణామం అన్నారు. ఎమ్మెల్యే గారి ముందస్తు చొరవతో చిత్తూరు నియోజకవర్గంలో 70కి పైగా బోర్లు వేయడం వల్ల ఎక్కడా నీటి సమస్య తలెత్తలేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎప్పుడు ముందుచూపుతో ఆలోచిస్తారని.. ఎన్టీఆర్ జలాశయం నిర్మాణం వల్ల చిత్తూరు ప్రజలకు చాలా వరకు నీటి సమస్య తీరిందన్నారు. ఇదే తరహాలో భవిష్యత్తులో నగరానికి అడవి పల్లి రిజర్వాయర్ నుంచి నీటిని తెస్తామని, నీవా బ్రాంచ్ కెనాల్ ను పూర్తిచేసి సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నివా బ్రాంచ్ కెనాల్ కు నిధులు విడుదల చేయడం పట్ల కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా ప్రధాన కార్యదర్శి పచ్చయప్ప, మోహన్ రాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనురాధ, ఈశ్వరరావు, క్లస్టర్,డివిజన్, బూత్ ఇన్చార్జులు, తెదేపా కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా మాజీ మంత్రి జన్మదిన వేడుకలు

- జనసంద్రంగా మారిన ఉగ్గంపల్లి
- సాధనాల రాము పుష్పగుచ్ఛం అందజేత



స్వర్ణ సాగరం డోర్నకల్ ఆగష్టు 20:

సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలందించిన మాజీ మంత్రి రెడ్యానాయక్ 74వ జన్మదినం పురస్కరించుకొని ఉగ్గంపల్లిలోని ఆయన స్వగృహంలో తెరాస శ్రేణులు పోటెత్తారు.డోర్నకల్ మండల శ్రేణులు భారీగా తరలి వెళ్లి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కన్నుల పండుగగా సాగిన వేడుకలో పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు సాధనాల రాము పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఐటీ విప్లవ ఆద్యుడు రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**స్వర్ణ సాగరం డోర్నకల్ ఆగష్టు 20:** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను డోర్నకల్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి.పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుమేర్ జైన్ నేతృత్వంలో గాంధీ కూడలిలో పుర పాలకవర్గం,నాయకులు,కార్యకర్తలు పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశ సాంకేతిక ప్రగతి,ఐటీ విప్లవానికి రాజీవ్ గాంధీ వేసిన పునాదులే కారణమని కొనియాడారు.18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించి పంచాయతీరాజ్ వ్యవస్థను అధికార వికేంద్రీకరణ చేసిన ఘనత ఆయనదేనని స్మరించుకున్నారు.కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకూ ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.సామాన్యుడు బతికే పరిస్థితి లేకుండా ధరలను పెంచుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు.అలాగే నూతనంగా ఎంపికైన కో ఆప్షన్ సభ్యులు శీలం భాగ్యలక్ష్మి శ్రీనివాస్,ఖాదర్ బాబా,బసిక విమల అశోక్,ఏపూరి కృష్ణ లనుడోర్నకల్–ఖమ్మం ఆటో యూనియన్ అధ్యక్షుడు శంకర్ తేజావత్,వైస్ ప్రెసిడెంట్ ఏపూరి నరేందర్,సెక్రెటరీ కట్కూరి రాంప్రసాద్,ముఖ్య సలహాదారులు నెత్తికొప్పుల సురేష్ ఘనంగా సత్కరించారు.పుర చైర్ పర్సన్ కొండేటి రాజకుమారి హరినాథ్,వైస్ చైర్ పర్సన్ మాదా లావణ్య శ్రీనివాస్,కౌన్సిలర్లు సువర్ణ హరికృష్ణ,సంధ్య వెంకటేష్,హేమలత,ప్రమీల,రామ్ కోటేష్,నవీన్,గారె రమేష్,మండల అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ యాదవ్,మాజీ చైర్మన్ వీరన్న,వైస్ చైర్మన్ కోటిలింగం,ఏపూరి రమణయ్య, మున్నా, ప్రవీణ్, తదితరులున్నారు.

## డబ్బుతో నన్ను ఎవరూ కొనలేరు: రాజ్‌పాల్ యాదవ్



ప్రముఖ బాలీవుడ్ హాస్యనటుడు రాజ్‌పాల్ యాదవ్ గత కొంతకాలంగా చెక్ బౌన్స్ కేసుల వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తనపై వస్తున్న విమర్శలు, ఆర్థిక ఇబ్బందులు మరియు న్యాయపరమైన వివాదాలపై ఆయన స్పందించారు. సినిమా పట్ల తనకు ఉన్న అనుబంధాన్ని, అంకితభావాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బుతో కొలవలేమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డబ్బుతో నన్ను ఎవరూ కొనలేరంటూ తేల్చిచెప్పారు. 2013 నుంచి 2016 మధ్య కాలంలో తలెత్తిన సంక్షోభం వల్ల తాను కోట్లల్లో నష్టాన్ని చవిచూశానని ఆయన తెలిపారు. ఈ చట్టపరమైన చిక్కుల కారణంగా తన వృత్తిపరమైన ప్రయాణానికి తీవ్ర విఘాతం కలిగిందని, విదేశాల్లో జరగాల్సిన కనీసం 50కి పైగా పర్యటనలు, టూర్లను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, అనివార్య పరిస్థితుల వల్ల తన పారితోషికాన్ని కూడా తగ్గించుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. డబ్బు కంటే కళే తనకు ముఖ్యమని చెబుతూ.. తాను కేవలం సినిమా విద్యార్థినని, నటనలో పరిపూర్ణత సాధించడమే తన లక్ష్యమని రాజ్‌పాల్ యాదవ్ అన్నారు. ఎన్ని కష్టాలు, సవాళ్లు ఎదురైనా ప్రేక్షకులు తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలు ఎప్పటికీ మారలేదన్నారు. విమానాశ్రయాల్లో ప్రతిసారీ వందలాది మంది అభిమానులు వచ్చి తనతో సెల్ఫీలు దిగడమే ప్రజల నుంచి తనకు లభిస్తున్న నిజమైన ఆదరణకు నిదర్శనమని ఆయన తెలిపారు. గతంలో నటుడు రాజ్‌పాల్ యాదవ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అటా పటా లపట్టా' (ఘ్ఖు ్రఘ్ఖు ఘుజూఘ్ఖు) సినిమా ఆయన కెరీర్‌లో ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ చిత్రం కోసం ఆయన పెద్దఎత్తున అప్పులు చేసి భారీ వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టారు. అయితే బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆయన తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. ఈ నేపథ్యంలోనే తలెత్తిన లావాదేవీల వివాదాలు కోర్టుల వరకు వెళ్లాయి. ఈ విఫల ప్రయత్నం కారణంగా తలెత్తిన ఆర్థిక సమస్యలు చెక్ బౌన్స్ కేసులకు దారితీశాయి. దీనికి సంబంధించి పలు వేర్వేరు చెక్ బౌన్స్ కేసుల్లో ఢిల్లీ హైకోర్టు రాజ్‌పాల్ యాదవ్‌ను దోషిగా తేల్చింది. ప్రతి కేసుకు సంబంధించి ఫిర్యాదుదారునికి భారీ మొత్తంలో నష్టపరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

## ధర్మస్థల నియోజకవర్గం



సుమన్, సాయికుమార్, నటరాజ్, వరుణ్‌సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'ధర్మస్థల నియోజకవర్గం'. జై జ్ఞానప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మిస్తున్న ఈ పొలిటికల్ ఎంటర్‌టైనర్ సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌ని నిర్వహించారు. నటీనటులంతా ఈ సినిమాలో భాగమైనందుకు ఆనందం వెలిబుచ్చారు. అన్ని వర్గాలకూ నచ్చే ఓ మంచి కథతో థియేటర్లలోకి రాబోతున్నామని దర్శకుడు జై జ్ఞానప్రభ తోట నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా నిర్మాత మేరుం భాస్కర్, పీవీఆర్ సినిమాస్ ప్రతినిధి ఉదయ్ కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి మాటలు: అస్లాం, కెమెరా: వెంకట హనుమ, సంగీతం: మహావీర్ ఎల్లంధర్.




## హైప్ పెంచేస్తున్న సుహాస్, సూరి 'మండాడి' పోస్టర్లు

టాలీవుడ్ యాక్టర్ సుహాస్ వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తోన్న తమిళ చిత్రం మండాడి (ఝఅఋఋఎఅ). సుహాస్ కోలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న ఈ మూవీలో తమిళ నటుడు సూరి మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. సెల్ఫీ ఫేం మతిమారన్ పుగళేంది డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ సెప్టెంబర్ 10న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ఏదో ఒక అప్‌డేట్ అందిస్తూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన రషెస్ నెట్టింట హల్ చల్ చేస్తుండగా సుహాస్ బర్త్ డే స్పెషల్ ఒకటి ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. మరోవైపు సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి క్లీన్ యూ/ఏ 16ం సర్టిఫికెట్ జారీ చేసినట్టు తెలియజేస్తూ సూరి బోటు రైడ్ చేస్తూ అగ్రెసివ్‌గా ఉన్న లుక్‌ను షేర్ చేశారు. ఈ లుక్ మండాడిపై హైప్ పెంచేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో మండాడి థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టాలీవుడ్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ దక్కించుకుంది. దీంతో మండాడి సినిమాపై అంచనాలు మరింత పెరిగిపోతున్నాయి. తీర ప్రాంతం, మత్స్యకారుల నేపథ్యంలో స్పోర్ట్స్ డ్రామాగా వస్తోన్న ఈ మూవీలో సుహాస్ సాట్టపులి రోల్‌లో కనిపించబోతున్నాడు. మహిమా నంబియార్ కీలక పాత్రలో నటిస్తుండగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్యుత్ కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండగా.. ఆర్‌ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ తెరకెక్కిస్తోంది.




## శర్వానంద్ 'భోగి' సినిమా విడుదల వాయిదా.. అసలు కారణం ఇదే!

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని వాస్తవానికి ఆగస్టు 28న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా చిత్ర యూనిట్ నుంచి వెలువడిన సమాచారం ప్రకారం ఈ సినిమా అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు రావడం లేదు. వీఎఫ్ఎక్స్ (ఎఖీశ) పనులకు మరింత సమయం పడుతుండటంతో ఈ సినిమా విడుదలను వాయిదా వేసినట్లు తెలుస్తుంది. సినిమాలోని విజువల్ స్కేల్, పీరియడ్ వరల్డ్ మరియు యాక్షన్ సీక్వెన్స్‌లను ఎక్కడా రాజీ పడకుండా అత్యుత్తమంగా తీర్చిదిద్దే ఉద్దేశంతోనే ఈ వాయిదా వేసినట్లు తెలిపారు. వీఎఫ్ఎక్స్ పనులు పూర్తిగా పూర్తయిన తర్వాత కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటించనున్నట్లు స్పష్టం చేశారు. 1960ల నాటి ఉత్తర తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో ఈ బలమైన కథ సాగనుండగా, ఇందులో శర్వానంద్ 'గంగా' అనే అత్యంత ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఆయన సరసన అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా క్లైమాక్స్ కోసం చిత్రబృందం ఏకంగా 30 రోజుల పాటు సాగిన భారీ యాక్షన్ షెడ్యూల్‌ను ఇటీవల విజయవంతంగా పూర్తి చేసింది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది.



Edited Printed Published & Owned by DAMA VIJAYA KUMAR. And Printed at VSR Printers, # 1-176, Vakadu Village and post, Vakadu Mandal, Tirupati District, Pin : 524415, A.P.
Published at **VSR** Publications, H.No. 403, Panta Street, Chittoor, Andhra pradesh, Pin : 517501, **EDITOR DAMA VIJAYAKUMAR**, **RNI. NO. APTEL/26/A2367**